RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 సంచిక 09 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ శనివారం 11-04-2026 పేజీలు: 8, వెల : 2.00

తెలంగాణ వాణి
R N I No. APTEL/2012/53127
The Voice of Telangana

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292



2వ పేజీలో...

## 'హర్మూజ్' నిర్వహణపై మొజ్తాబా..

# కీలక ప్రకటన

**కొత్త దశకు తీసుకెళ్తామని వ్యాఖ్య..!**

ఢిల్లీ,: హర్మూజ్ జలసంధి నిర్వహణపై ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ కీలక ప్రకటన చేశారు. జలసంధి నిర్వహణను కొత్త దశకు తీసుకెళ్తామని ఆయన ప్రకటించారు. ఈ దశలో హర్మూజ్‌పై అనుసరించే విధానం మరింత వ్యూహాత్మకంగా, కఠినంగా ఉంటుందని సంకేతాలు ఇచ్చారు. ఈ మేరకు ఆయన చేసిన ప్రకటనను ఇరాన్ మీడియా చదివి వినిపించింది. అమెరికా– ఇరాన్ దేశాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ.. చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్‌లో పరిస్థితులు ఇంకా కుదుటపడలేదు. ఈ క్రమంలో జలసంధిని కొత్త దశకు తీసుకెళ్తామని మొజ్తాబా ప్రకటించడం కీలక పరిణామంగా మారింది. ఇక ఇరాన్ యుద్ధాన్ని కోరుకోవడం లేదని సుప్రీంనేత స్పష్టంచేశారు.

## మహిళల రాజకీయ సాధికారతకు

# చారిత్రాత్మక నిర్ణయం

**రిజర్వేషన్ బిల్లుకు మోదీ పిలుపు**



2వ పేజీలో...

హైదరాబాద్: ఏప్రిల్ 10: భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్ని పార్టీల పార్లమెంట్ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల చట్టసవరణ బిల్లుకు ప్రారంభ లెక్కలు మొదలైన నేపథ్యంలో, ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో నిర్వహించనున్న ప్రత్యేక సమావేశాలకు హాజరై బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించాలని ఆయన కోరారు. 2029 సాధారణ ఎన్నికల నుండి మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే ఈ బిల్లు దేశ రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే కీలక సంస్కరణగా భావిస్తున్నారు.



## నాటో దేశాల తీరుపై

# ట్రంప్ మరోసారి విసుర్లు

వాషింగ్టన్: అమెరికా, ఇరాన్ మధ్య కాల్పుల విరమణకు సంబంధించి కీలక చర్చలకు రంగం సిద్ధమైంది. ఇందుకు పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా నిలవనుంది. చర్చల కోసం ఇరు దేశాల ప్రతినిధి బృందాలు గురువారం రాత్రికి ఇస్లామాబాద్‌కు చేరుకున్నాయి. ఈ భేటీ కోసం భారీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పాక్ ప్రధాని కార్యాలయం ప్రకటించింది. చర్చలకు వచ్చే బృందాలకు పూర్తి సహకారం అందిస్తామని ప్రధాని షెహబాజ్ షరీఫ్ హామీ ఇచ్చారు. అయితే, ఈ చర్చలకు ముందే ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది.

2వ పేజీలో...

ఖమ్మం : తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. రాజకీయ విమర్శల విషయంలో మంత్రి పొంగులేటి మరింత ఘాటుగా స్పందిస్తూ, తమకు అంటిన బురదను అధికార పార్టీ నేతలకు అంటించాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలినా, కారుకూతలు కూసినా ఈ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని, ప్రతిపక్షాల తాటాకు చప్పుళ్లకు తాము బెదిరే ప్రసక్తే లేదని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇందిరమ్మ రాజ్యాన్ని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో నూతనంగా నిర్మించిన గోదాము ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ధాన్యం సేకరించిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని స్పష్టం చేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ. 12,000 అందిస్తున్నామని తెలిపారు.



2వ పేజీలో...

## బీఆర్ఎస్ ఆరోపణలపై తీవ్ర స్థాయిలో..

# ధ్వజమెత్తిన పొంగులేటి

**తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని వ్యాఖ్య**



# విద్యార్థులకు అలర్ట్

## ఈనెల 12న తెలంగాణ ఇంటర్

# ఫలితాలు!

2వ పేజీలో...

హైదరాబాద్: తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఫలితాల సందడి మొదలైంది. ఏప్రిల్ 12న (ఆదివారం) ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలనువిడుదల చేసేందుకు ఇంటర్ బోర్డు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 26 నుంచి మార్చి 18 వరకుజరిగిన ఇంటర్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9 లక్షలకు పైగా విద్యార్థులు హాజరయ్యారు.



2వ పేజీలో...

## కాళేశ్వరాన్ని రెండేళ్లుగా..

# ఎందుకు నానబెట్టారు

**ఇప్పుడే రిపేర్లు చేయడంలో ఆంతర్యం ఏమిటో**
**గతంలోనే చేసివుంటే రైతులకు మేలు జరిగేది కదా**
**కేవలం కమిషన్ల కోసమేనేమో అన్న అనుమానాలు**
**రియల్ ఎస్టేట్ కోసమే ఫ్యూచర్ సిటీ జపం**
**జిహెచ్ఎంసిలో తీవ్ర అవినీతి జరుగుతోంది**
**మీడియా సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత**





# రాజ్యసభ సభ్యుడిగా నితీశ్ ప్రమాణం

న్యూఢిల్లీ,ఏప్రిల్10 : బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శుక్రవారం రాజ్యసభ సభ్యునిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ సి.పి రాధాకృష్ణన్ తన ఛాంబర్‌లో నితీష్‌కుమార్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. నితీష్‌కుమార్ హిందీలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, రాజ్యసభ నేత జెపి నడ్డా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌లు హాజరయ్యారు. అలాగే జెడియు నేత, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజరు కుమార్ ఝా, కాంగ్రెస్ నేత జైరాం రమేష్, బిజెపి ఎంపి మాజీ కేంద్రమంత్రి అయిన రాజీవ్ ప్రతాప్ రూడీ తదితరులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఎన్‌డిఎ తదుపరి బీహార్ సిఎం ఎవరనేది త్వరలోనే వెల్లడించనుంది. బహుశా ఏప్రిల్ 14న కొత్త ముఖ్యమంత్రిని ఎన్‌డిఎ ఎన్నుకునే అవకాశం ఉంది.



2వ పేజీలో...

## హరివంశ్ నారాయణ సింగ్ కు

# మరో ఛాన్స్

- రాష్ట్రపతి కోటాలో నామినేట్ చేసిన కేంద్రం
- మరోమారు డిప్యూటీ ఛైర్మన్ అయ్యే అవకాశం

న్యూఢిల్లీ, ఏప్రిల్10 : రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ కొనసాగే అవకాశముంది. అనుభవజ్ఞుడైన నాయకుడిగా, నిష్పక్షపాతంగా సభను నడిపించే సమర్థత కలిగిన వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉంది. భారత పార్లమెంట్ ఎగువ సభలో అత్యంత హుందాతనం గల నేతగా పేరుగాంచిన హరివంశ్.. మరోసారి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగబోతున్నారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ పదవీ విరమణతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేస్తూ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనను నామినేట్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 80 ప్రకారం.. సాహిత్యం, శాస్త్రం, కళలు, సామాజిక సేవ వంటి రంగాల్లో విశేష కృషి చేసిన 12 మందిని రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేస్తారు. హరివంశ్ తనకున్న సుదీర్ఘ జర్నలిజం అనుభవం, సామాజిక స్పృహతో ఈ కోటాలో ఎంపికయ్యారు. బిహార్ నుంచి జేడీయూ తరఫున ఎన్నికైన ఆయన సభ్యత్వ కాలం ఏప్రిల్ 9వ తేదీన ముగిసింది. సాధారణంగా పార్టీ కోటాలో సభ్యత్వం ముగిసిన తర్వాత తిరిగి పార్టీ టికెట్‌పైనే వస్తుంటారు. కానీ, కేంద్ర ప్రభుత్వం ఆయన సేవలను ప్రత్యేకంగా గుర్తించి రాష్ట్రపతి కోటా ద్వారా నేరుగా సభకు పంపడం గమనార్హం. రాజ్యసభ 13వ డిప్యూటీ ఛైర్మన్‌గా ఆయన పనిచేసిన తీరు అమోఘం. క్లిష్టమైన బిల్లుల చర్చ సమయంలో సభలో గందరగోళం నెలకొన్నప్పుడు, ఆయన చూపిన ప్రతిభ, నిష్పక్షపాత నిర్ణయాలు అధికార, ప్రతిపక్షాల మన్ననలు పొందాయి.

హైదరాబాద్,ఏప్రిల్10 : హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ డ్రగ్ ఫ్రీ సిటీ' ఇప్పుడు పెను సంచలనం సృష్టిస్తోంది. రౌడీషీటర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తీసుకున్న సాహసోపేత నిర్ణయం ఇప్పుడు నేరగాళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. భాగ్యనగరంలో పెరుగుతున్న నేరాలకు మత్తు పదార్థాలే కారణమని గుర్తించిన పోలీసులు, రౌడీషీటర్ల పని పట్టేందుకు సరికొత్త వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రౌడీషీటర్లను పిలిపించి వారికి డ్రగ్ కిట్స్ ద్వారా పరీక్షలు నిర్వహించడంతో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. సీపీ సజ్జనార్ ఆదేశాలతో రౌడీషీటర్లకు డ్రగ్ టెస్టులు నిర్వహించారు. నగరంలో ప్రస్తుతం 1,300 మందికి పైగా రౌడీషీటర్లు ఉన్నారు.



2వ పేజీలో...

## ఆపరేషన్ డ్రగ్ ఫ్రీ సిటీపై

# ఫోకస్

- రౌడీ షీటర్లకు డ్రగ్ టెస్టులతో విస్తుపోయే నిజాలు
- 75శాతం మంది రౌడీషీటర్లు గంజాయి బానిసలుగా గుర్తింపు

# హరివంశ్ నారాయణ సింగ్ కు మరో ఛాన్స్



హరివంశ్ నారాయణ్ సింగ్‌ను మళ్లీ సభకు పంపడం వెనుక కేంద్ర ప్రభుత్వం కొన్ని కీలక వ్యూహాలను రచించిన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎగువ సభలో ప్రతిపక్షాల బలం గణనీయంగా ఉన్నప్పుడు, సభను సమర్థవంతంగా నడపగలిగే వ్యక్తుల అవసరం ప్రభుత్వానికి ఉంటుంది. హరివంశ్ ఆ విషయంలో ఇప్పటికే తన సత్తా చాటారు. తాజా నామినేషన్‌తో ఆయన మళ్లీ రాజ్యసభ డిప్యూటీ

మొదటిపేజీ తరువాయి...

ఛైర్మన్‌గా ఎన్నికయ్యే అవకాశముంది. నామినేటెడ్ సభ్యుడిగా ఉంటూ ఈ బాధ్యతలు చేపడితే, అది సభకు మరింత గౌరవాన్ని తెస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. సీనియర్ జర్నలిస్టుగా హరివంశ్‌కున్న విలువలు, రాజకీయాలకు అతీతంగా ఆయనకు ఉన్న ఆదరణ ప్రభుత్వానికి సానుకూల అంశమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రాజకీయాల్లో హుందాతనం తగ్గుతున్న కాలంలో, హరివంశ్ నారాయణ్ సింగ్ వంటి సీనియర్ల సేవలను వినియోగించుకోవడం ప్రజాస్వామ్యానికి శుభపరిణామమని తెలిపారు. రంజన్ గొగొయ్ స్థానంలో ఓ అనుభవజ్ఞుడైన పార్లమెంటేరియన్ రావడం సభ గౌరవాన్ని మరింత పెంచుతుందనడంలో సందేహం లేదని పేర్కొన్నారు. హరివంశ్ నారాయణ్ సింగ్ మళ్లీ డిప్యూటీ ఛైర్మన్ బాధ్యతలు చేపడితే.. సభలో చర్చల నాణ్యత మరింత మెరుగుపడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఆపరేషన్ డ్రగ్ ఫ్రీ సిటీపై ఫోకస్

మొదటిపేజీ తరువాయి...

వారిలో 250 మందికిపైగా డ్రగ్ టెస్టులు నిర్వహించారు. 190 మందికి గంజాయి పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ రౌడీషీటర్లకు గంజాయి ఎక్కడి నుంచి సరఫరా అవుతోంది? దీని వెనుక ఉన్న ప్రధాన ముఠాలు ఎవరు? అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పాజిటివ్ వచ్చిన వారిని వెంటనే రీహ్యాబిటేషన్ కేంద్రాలకు తరలిస్తూనే, నగరంలో ఈ మత్తు నెట్‌వర్క్‌ను పూర్తిగా ఛేదించేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. నగర ప్రజల భద్రత కోసం ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసు ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రౌడీషీటర్లందరినీ నిశితంగా గమనిస్తున్న పోలీసులు, వారి ప్రవర్తనలో మార్పులు రావడానికి ప్రధాన కారణం మత్తు పదార్థాలని తేల్చారు. కమిషనరేట్ పరిధిలో సుమారు 1300 మంది రౌడీషీటర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మొదటి విడతలో సుమారు 250 మందికి డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు చేసిన 250 మందిలో ఏకంగా 190 మందికి పాజిటివ్ వచ్చినట్లు సమాచారం. అంటే సుమారు 75శాతం మంది రౌడీషీటర్లు మత్తుకు బానిసైనట్లు స్పష్టమవుతోంది. పాజిటివ్ వచ్చిన వారిలో ఎక్కువ మంది గంజాయికి అలవాటు పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. నేరస్థులను కేవలం జైలుకు పంపడం ద్వారా మార్పురాదని సీపీ సజ్జనార్ భావించారు. ఈ సమస్యను మూలాల నుంచి తొలగించాలని నిర్ణయించారు. డ్రగ్స్ పాజిటివ్ వచ్చిన రౌడీషీటర్లను పోలీసులు వెంటనే రీహాబిలిటేషన్ కేంద్రాలకు తరలిస్తున్నారు. వారిని మత్తు నుంచి బయట పడేసి, సాధారణ పౌరులుగా మార్చడమే దీని ముఖ్య ఉద్దేశం. వెస్ట్ జోన్ పరిధిలో 20 మందికి పాజిటివ్ రావడంతో బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో వారిని ఉంచి విచారిస్తున్నారు. రౌడీషీటర్లకు గంజాయి,



ఇతర డ్రగ్స్ ఎక్కడి నుంచి అందుతున్నాయి?, వీటి వెనుక ఉన్న ప్రధాన నిందితులు ఎవరు? అనే కోణంలో పోలీసులు కూపీ లాగుతున్నారు. మత్తు పదార్థాల ప్రభావంతో రౌడీషీటర్లు విచక్షణ కోల్పోయి దాడులు, హత్యలు, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. మత్తులో ఉన్నప్పుడు నేరం చేసేందుకు ఏమాత్రం వెనుకాడకపోవడంతో భాగ్యనగరంలో అశాంతి నెలకొంటోంది. ఈ క్రమంలో డ్రగ్ టెస్టులు నిర్వహించడం ద్వారా వారిని కట్టడి చేయడమే కాకుండా, మత్తు నెట్‌వర్క్‌ను ఛేదించవచ్చని పోలీసులు భావిస్తున్నారు. హైదరాబాద్ నగరాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు ఈ ఆపరేషన్ నిరంతరం కొనసాగుతుందని పోలీసులు స్పష్టం చేశారు. కేవలం రౌడీషీటర్లే కాకుండా, డ్రగ్స్ సరఫరా చేసే పెడ్లర్లపై కఠినమైన పీడీ యాక్ట్ ప్రయోగించేందుకు సిద్ధమవు తున్నారు. నగరంలో శాంతికి విఘాతం కలిగించే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని పోలీసులు స్పష్టం చేశారు. ముఖ్యంగా యువతను పక్కదారి పట్టిస్తున్న మత్తు మహమ్మారిని అంతం చేసేందుకు ప్రజలు కూడా సహకరించాలని సూచించారు. ఈ భారీ ఆపరేషన్ ద్వారా హైదరాబాద్ పోలీస్ యంత్రాంగం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది.

# డిజిటల్ సాంకేతికతతో అంగన్‌వాడీ సేవల మెరుగుదల

**అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**11,650కు పారదర్శక టెండర్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌ల కొనుగోలు**

**త్వరలోనే 15 వేల అంగన్వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్**

**సిబ్బంది సంక్షేమం, వేతనాల పెంపుపై సానుకూల నిర్ణయం త్వరలో**

**అంగన్వాడి టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమంలో**

**మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)**

భద్రాద్రి బ్యూరో (తెలంగాణ వాణి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం ప్రారంభోత్సవం, అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించబడింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దానసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఆదివాసి సంప్రదాయమైన కొమ్ము నృత్యంతో స్వాగతం పలికిన అనంతరం మంత్రి మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాళ్లను సందర్శించి, అంగన్‌వాడీ సిబ్బంది తయారు చేసిన ఆహార పదార్థాలు, పిల్లలకు అర్థమయ్యే విధంగా రూపొందించిన విద్యా నమూనాలను పరిశీలించారు. అనంతరం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. "బేటీ బచావో" పథకం కింద ఆడపిల్లల తల్లులకు హిమాలయ కిట్లను అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోషకాహార కార్యక్రమాలు రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అభినందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ ద్వారా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పిల్లల బరువు, పోషకాహార వివరాలు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య సమాచారాన్ని డిజిటల్ విధానంలో నమోదు చేయడం ద్వారా పారదర్శకత, వేగం పెరుగుతాయని వివరించారు. స్మార్ట్‌ఫోన్‌ల కొనుగోలు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించబడిందని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఓపెన్ టెండర్ విధానంలో కొనుగోలు చేపట్టగా ప్రారంభంలో సుమారు 14,000 వరకు ధరలు వచ్చినప్పటికీ పలు దఫాల టెండర్ ప్రక్రియ అనంతరం ఒక్కో ఫోన్‌ను 11,650కు పొందగలిగామని తెలిపారు. ప్రజల డబ్బు ఆదా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని మంత్రి సూచించారు. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల క్రితం 9,000కు ఫోన్లు కొనుగోలు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రస్తుతం చేపట్టిన పారదర్శక విధానంపై దుష్ప్రచారం జరుగుతోందన్నారు. ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, భద్రాద్రి కొత్తగూడెం వంటి జిల్లాల్లో అంగన్‌వాడీలలో బ్రేక్‌ఫాస్ట్ పథకాలను పైలట్ ప్రాజెక్టులుగా అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి 12 వేల భవనాలు మంజూరు చేయడం, మినీ కేంద్రాల అప్‌గ్రేడేషన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు వంటి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద ఇప్పటివరకు సుమారు 8 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. జీవో విడుదలకు ముందే రిటైర్ అయిన వారికి కూడా ఈ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వేతనాల పెంపు అంశాన్ని పరిశీలిస్తున్నామని, త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. అదేవిధంగా సుమారు 15 వేల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. అంగన్‌వాడీ టీచర్లకు కేంద్ర ప్రభుత్వం కేవలం 2,800 మాత్రమే అందిస్తోందని, మిగతా భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందని తెలిపారు. జీతభత్యాల పెంపు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో 275 మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నామని తెలిపారు. త్వరలో నిపుణులు, అంగన్‌వాడీ టీచర్లతో కమిటీ ఏర్పాటు చేసి అభివృద్ధి చర్యలపై మేధోమథనం నిర్వహిస్తామని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను పోషకాహార లోపం లేని జిల్లా, బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్లు పిల్లలను తమ సొంత పిల్లలుగా భావించి సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బందికి స్మార్ట్‌ఫోన్‌లు అందించడం ద్వారా సేవల సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం మహిళలు, చిన్నారుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలను ఆధునికీకరించడంలో ఈ కార్యక్రమం కీలకమని, కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీ కీలకమని పేర్కొన్నారు.

## మహిళల రాజకీయ సాధికారతకు చారిత్రాత్మక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి...

భారతదేశ నాగరికతా స్ఫూర్తికి ఇది ఒక ధృవీకరణగా నిలుస్తుందని, దేశాభివృద్ధిలో మహిళల కీలక పాత్రను గుర్తించి వారి సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ప్రధాని పేర్కొన్నారు. మహిళల ప్రతినిధిత్వాన్ని పెంచడం ద్వారా ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని, భావితరాల భవిష్యత్తుకు ఇది ఒక కీలక నిర్ణయమని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దేశవ్యాప్తంగా ఈ బిల్లుపై ఆసక్తి నెలకొంది.

# హైదరాబాద్-విజయవాడ మధ్య విమాన సర్వీసు

## ఫ్లై 91 విమాన సర్వీసును ప్రారంభించిన రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం/విజయవాడ,ఏప్రిల్10 : హైదరాబాద్ - విజయవాడ మధ్య ప్రయాణించే వారికి శుభవార్త. ప్రాంతీయ విమానయాన సంస్థ ఫ్లై 91 తన నూతన సర్వీసులను తెలుగు రాష్ట్రాల మధ్య అధికారికంగా ప్రారంభించింది. రెండు తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య ప్రయాణ దూరాన్ని తగ్గించడంతో పాటు, సామాన్యులకు విమాన ప్రయాణాన్ని చేరువ చేసే లక్ష్యంతో ఫ్లై 91 సంస్థ తన కార్యకలాపాలను విస్తరించింది. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ నూతన సర్వీసును శ్రీకాకుళం నుంచి వర్చువల్‌గా పచ్చజెండా ఊపి ఈ సర్వీసును శుక్రవారం ప్రారంభించారు. తక్కువ ధరలో వేగవంతమైన ప్రయాణాన్ని అందించడమే ఈ సంస్థ ప్రధాన ఉద్దేశ్యం. విమాన సర్వీసును ప్రారంభించిన అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా టైర్-2, టైర్-3 నగరాలను అనుసంధానించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రాంతీయ కనెక్టివిటీని పెంచడం ద్వారా సామాన్యులు కూడా విమానం ఎక్కాలన్న ప్రధానమంత్రి కల నిజమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ - హైదరాబాద్ మధ్య రద్దీ దృష్ట్యా ఈ సర్వీస్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రోడ్డు మార్గంలో సుమారు 5 నుంచి 6 గంటల సమయం పట్టే ప్రయాణం, విమానం ద్వారా కేవలం 50 నిమిషాల నుంచి గంటలో పూర్తవుతుంది. హైదరాబాద్‌లో ఐటీ రంగం, విజయవాడలో వ్యాపార రంగాలు




బలంగా ఉన్న నేపథ్యంలో, ఈ విమాన సర్వీస్ వ్యాపారవేత్తలకు వరంలా మారనుంది. ఫ్లై 91 సంస్థ తన టికెట్ ధరలను ఇతర విమాన సంస్థలతో పోలిస్తే అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు చేస్తోంది. ఈ సంస్థ గోవా కేంద్రంగా పనిచేస్తున్న ఒక ప్రాంతీయ విమానయాన సంస్థ. ఇది ప్రధానంగా తక్కువ దూరం ఉండే నగరాల మధ్య సర్వీసులను నడుపుతోంది. తెలుగు రాష్ట్రాల్లో తమ నెట్‌వర్క్‌ను పెంచుకోవడం ద్వారా ప్రయాణికులకు మరిన్నిసౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ కొత్త సర్వీసు అందుబాటులోకి రావడం వల్ల అటు విజయవాడ ప్రాంత ప్రజలకు, ఇటు హైదరాబాద్ ప్రజలకు రవాణా పరంగా మరిన్ని వెసులుబాట్లు కలగనున్నాయి. ఈ విమాన సర్వీసు అందుబాటులోకి రావడం వల్ల రోడ్డు ప్రయాణంపై ఒత్తిడి తగ్గనుందని భావిస్తున్నారు.

# కాళేశ్వరాన్ని రెండేళ్లుగా ఎందుకు నానబెట్టారు

మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్,ఏప్రిల్10 : కాళేశ్వరాన్ని వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. రెండున్నరేళ్లు దారుణంగా వ్యవహరించి పంటలు ఎండబెట్టారని ఆరోపించారు. ఇప్పటికే ఈ న ఇర్ణయం తీసుకుని ఉంటే రైతులకు మేలు జరిగి ఉండేదని అన్నారు. హైదరాబాద్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ..కమిషన్ల కోసమే ఇప్పుడు కాళేశ్వరానికి మరమ్మతులు అంటున్నారని మండిపడ్డారు. మున్సిపల్, అర్బన్ ఫారెస్ట్రీలో తీవ్రమైన అవినీతి జరుగుతోందన్నారు. రియల్ ఎస్టేట్ కోసం ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాద్‌కు నష్టం చేయవద్దని కోరారు. అలాగే జీహెచ్‌ఎంసీలో తీవ్ర అవినీతి జరుగుతోందని కవిత ఆరోపించారు. అనేక గ్రామాలు జీహెచ్‌ఎంసీ పరిధిలో కలిసినా సరైన అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. హెచ్‌ఎండీఏ పరిధిలో 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టారని తెలిపారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ అభివృద్ధికి ఉపయోగించలేదని కవిత ఆరోపించారు. హెచ్‌ఎండీఏకు ఛైర్మన్‌గా, వైస్ ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని గుర్తు చేశారు. 2017 నుంచి 2021 వరకు 480 కోట్ల రూపాయల పనులను నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని కవిత తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత మరో 1,140 కోట్ల రూపాయలను అదే పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని వెల్లడించారు. ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. రూ.50 కోట్ల టెండర్ వేస్తే దాదాపు 50 శాతం తిరిగి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని.. కానీ నామినేషన్ పద్ధతిలో ఇలాంటి లాభం లేకపోవడం అవినీతికి దారితీస్తోందని ఆరోపించారు. నర్సరీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న 6 వేల మంది స్కిల్డ్ లేబర్‌కు 23,800 రూపాయలు ఇవ్వాల్సి ఉందని కవిత తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో ఒక కంపెనీపై సీఎం రేవంత్ రెడ్డి సిట్ వేయించారని.. తర్వాత ఏమైందో తెలియాలని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డులో గత ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్టును రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక కూడా



కొనసాగిస్తున్నారని విమర్శించారు. దీనిపై ఆరోపణలు చేసిన రేవంత్ దీనిని ఎలా కొనసాగిస్తారని అన్నారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌పై ముఖ్యమంత్రి దృష్టి పెడుతున్నారని.. సీఎం దగ్గర బ్యాగులు మోసే వ్యక్తి చెప్పినట్టు మాత్రమే పనులు జరుగుతున్నాయని కవిత ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ అంటే గుంపు మేస్త్రి పాలనలో జరుగుతున్న మహా అవినీతి అని వ్యాఖ్యానించారు. అవినీతి కోసమే సీఎం 'ఫ్యూచర్ సిటీ' అంటున్నారని కవిత అన్నారు. నెల 25వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 21 కమిటీలు వేశామని కవిత చెప్పారు. 500 మంది వలంటీర్లు సేవలు అందిస్తారని తెలిపారు. మహిళా బిల్లు అమలు కాకపోవడంతో 12 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు నష్టపోయారని చెప్పారు. 2027 జనగణన తర్వాత మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. ధర్మపురి అరవింద్‌లో పురుష అహంకారం కనిపిస్తోందని.. ప్రజలు ఆయన్ను ఎప్పుడో మర్చిపోయారని కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నాను... ఎవరో చెప్తే పార్టీ పెట్టే స్థాయిలో లేను' అని కవిత స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను కేరళం ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని తాము వీడియో రిలీజ్ చేశామని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.

## 'హర్మూజ్' నిర్వహణపై మొజ్తాబా కీలక ప్రకటన..

మొదటిపేజీ తరువాయి...

కానీ ఎట్టిపరిస్థితుల్లో తమ హక్కులను వదులుకోమని వ్యాఖ్యానించారు. దాడుల్లో తన తండ్రి అయతుల్లా అలీ ఖమేనీ సహా అనేకమంది కీలక నేతల మరణానికి ప్రతీకారం తీర్చుకోవాలని ఇరాన్ దృఢ నిశ్చయంతో ఉందన్నారు. యుద్ధంలో ఇరాన్ స్పష్టమైన విజయం సాధించిందని ఖమేనీ చెప్పారు. ఈ దాడుల్లో జరిగిన నష్టాలన్నింటికీ పరిహారం చెల్లించాలని తాము డిమాండ్ చేస్తామని అన్నారు. హర్మూజ్ జలసంధి విషయంలో ఇరాన్ అత్యంత దారుణంగా వ్యవహరిస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మండిపడ్డారు. జలసంధి మీదుగా వెళ్లే ట్యాంకర్లపై ఇరాన్ టోల్ వసూలు చేస్తున్నట్లు వెలువడుతున్న వార్తల గురించి ప్రస్తావించారు. వారు అలా చేసి ఉండకూడదని, ఒకవేళ చేస్తే వెంటనే ఆపేయాలని ఆయన ట్రూత్ సోషల్ వేదికగా హెచ్చరించారు. ఇరాన్ సహకరించినా, సహకరించకపోయినా జలసంధి మీదుగా చమురు రవాణా త్వరగా ప్రారంభమవుతుందని మరో పోస్టులో తెలిపారు.

## బీఆర్ఎస్ ఆరోపణలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన పొంగులేటి..

మొదటిపేజీ తరువాయి...

గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ వల్ల రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించేందుకు దానిని బంగాళాఖాతంలో కలిపి, పారదర్శకమైన 'భూ భారతి' విధానాన్ని తీసుకొచ్చామని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఎనభై వేల మంది రైతులకు కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా ఐదు వందల రూపాయల బోనస్ ఇస్తున్నామని, పండించిన సన్న బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించకుండా రేషన్ ద్వారా రాష్ట్రంలోని పేదలకు అందిస్తున్నామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, సీపీ సునీల్ దత్ మరియు పలువురు కార్పొరేషన్ ఛైర్మన్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈనెల 12న తెలంగాణ ఇంటర్ ఫలితాలు!

మొదటిపేజీ తరువాయి...

కాగా, తొలుత ఏప్రిల్ 11న ఫలితాలు రావచ్చని భావించినప్పటికీ, తుది ఏర్పాట్ల నేపథ్యంలో ఏప్రిల్ 12న ఫలితాలను ప్రకటించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఫలితాలు విడుదలైన వెంటనే విద్యార్థులు బోర్డు అధికారిక వెబ్‌సైట్ల (tgbie.cgg.gov.in)తో పాటు మొబైల్ యాప్స్ ద్వారా తమ మార్కులను తెలుసుకోవచ్చు. ఫలితాల్లో ఏదైనా తేడా ఉంటే రీ-కౌంటింగ్ లేదా రీ-వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు బోర్డు ప్రత్యేకంగా గడువు ఇవ్వనుంది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 1 నుంచి జూనియర్ కళాశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఈసారి రికార్డు స్థాయిలో వేగంగా ఫలితాలను వెల్లడిస్తుండటం విశేషం.

## నాటో దేశాల తీరుపై ట్రంప్ మరోసారి విసుర్లు

మొదటిపేజీ తరువాయి...

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేయడాన్ని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ తీవ్రంగా తప్పుపట్టారు. ఇది కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని, ఇలాంటి పరిస్థితుల్లో చర్చలు జరపడం అర్థరహితమని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, నాటో మిత్రదేశాలపై మరోసారి తన అసహనాన్ని వ్యక్తం చేశారు. "ఒత్తిడి చేస్తే తప్ప మనల్ని నిరాశపరిచే నాటో సహా మిత్ర దేశాలకు ఏమీ అర్థం కాదు" అని ఆయన తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. గతంలో ఇరాన్‌పై చర్యలు, హర్మూజ్ జలసంధి వద్ద భద్రత విషయంలో నాటో దేశాలు సహకరించలేదని ట్రంప్ తీవ్ర అసంతృప్తితో ఉన్న సంగతి తెలిసిందే.

## సంపాదకీయం

# హస్తినకు దీదీ..

ఈ దేశంలో మహిళా ప్రధానమంత్రిగా ఏకైక నాయకురాలు శ్ ఇందిరా గాంధీ ఉండేవారు. ఆమె ఐరన్ లేడీగా బలమైన ముద్ర వేసుకున్నారు. పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ మరోసారి అధికారంలోకి తీసుకురావాలని మమతా బెనర్జీ కాళ్లకు చక్రాలు కట్టుకొని తిరుగుతున్నారు. ఆమెను ఎలాగైనా అధికారంలో నుంచి దించి కాషాయపు జెండా ఎగరేయాలని బీజేపీ ప్రతి వ్యూహాలతో ప్రయత్నాలు చేస్తోంది1966 నుంచి 1977 దాకా ఏకంగా 11 ఏళ్ళ పాటు కంటిన్యూస్ గా దేశాన్ని పాలించిన ఇందిర బలమైన నాయకురాలిగా జాతీయంగా అంతర్జాతీయంగా ఎదిగారు. ఇక 1980 నుంచి 1984లో మరణించేంతవరకు మరో అయిదేళ్ల పాటు ప్రధానిగా పాలించారు. మొత్తంగా 16 ఏళ్ల పాటు దేశాన్ని ఇందిరాగాంధీ ఏలారు. ఆమె తరువాత మరో మహిళ ఈ దేశంలో ప్రధాని పీఠం ఎక్కలేదు. అయితే ఇపుడు ఒక మహిళా నేత పేరు ఈ పదవి కోసం గట్టిగా వినిపిస్తోంది. ఆమె ఎవరో కాదు బెంగాల్ ప్రజల చేత దీదీ అని పిలిపించుకుని ముమ్మారు పశ్చిన బెంగాల్ కి ముఖ్యమంత్రిగా పనిచేసి వరుసగా నాలుగవ సారి గెలిచి రికార్డు బద్ధలు కొట్టాలని చూస్తున్న తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ. బెంగాల్ లో ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తృణమూల్ కాంగ్రెస్ కీలక నేత అభిషేక్ బెనర్జీ ఒక సభలో మాట్లాడుతూ పాకిస్తాన్ ని ఉద్దేశించి హెచ్చరికలు జారీ చేశారు. కోల్ కటా మీదకు వస్తామని ఇళ్లలో దాడి చేస్తామని పాక్ పాలకులు అంటున్నారని కానీ తామే పాకిస్తాన్ మీదకు వెళ్ళి వారి సంగతి తేలుస్తామని వార్నింగ్ ఇచ్చారు. మమతా బెనర్జీ ఇండియా కూటమి తరఫున కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తరువాత ఇది తప్పకుండా జరుగుతుందని ఆయన స్పష్టంగా చెప్పారు. దీనిని బట్టి చూసిన వారు మమత ఇండియా కూటమి తరఫున ప్రధాని అభ్యర్థిగా ముందుకు వస్తున్నారా అన్న చర్చిస్తున్నారు.మూడు సార్లు బెంగాల్ సీఎం గా ఉన్న మమత 2026 ఎన్నికల్లో కనుక గెలిస్తే 2029 నాటికి ఆమె జాతీయ రాజకీయాల్లోకి వస్తారు అన్న చర్చ సాగుతోంది. మమత చూపు అపుడు ఢిల్లీ మీదనే ఉంటుందని అంటున్నారు. ఆ మాటకు వస్తే చాలా కాలంగా మమత జాతీయ రాజకీయల మీద ఆసక్తిగా ఉన్నారని అంటున్నారు. ఇక ఇండియా కూటమిలో కాంగ్రెస్ పెద్ద పార్టీగా ఉంది. ఆ తరువాత తృణమూల్ కాంగ్రెస్ ఉంటుంది. అందులో మరో బలమైన పార్టీగా డీఎంకే ఉన్నా కూడా సీనియారిటీ అనుభవం అన్నీ కలసి మమత ఇండియా కూటమి నాయకత్వాన్ని కోరుకుంటారు అని అంటున్నారు. బెంగాల్ లో విజయం తరువాత ఆమె ఇండియా కూటమి బాధ్యతలు తీసుకుని మోడీ సర్కార్ మీద గట్టిగా పోరాడుతారు అని అంటున్న ఇక మహిళా రిజర్వేషన్ అన్నది 2029 ఎన్నికల్లో గెలిచేందుకు తమ పార్టీకి ట్రంప్ కార్డు అవుతుందని బీజేపీ భావిస్తోంది కానీ అదే సమయంలో దేశంలో లోక్ సభ సీట్లు 840 దాకా పెరిగితే మాత్రం అందులో మూడవ వంతు మహిళా ఎంపీలే ఉంటారు అన్నది మరచిపోరారు. అలా లెక్క తీస్తే 280 దాకా ఎంపీ సీట్లు మహిళలకు దఖలు పడతాయి. దాంతో మహిళలు కూడా ప్రధాని పీఠం మీద గురి పెట్టేందుకు అవకాశాలు అధికం అవుతాయని అంటున్నారు. ఇక ఇండియా కూటమిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నా కూడా లీడ్ తీసుకుని బీజేపీ మీద పోరాటానికి మమత సిద్ధం అవుతారు అని అంటున్నారు. ఇండియా కూటమి నుంచి రేసులో : ఆ విధంగా డైనమిక్ లీడర్ షిప్ ని ఆమె ఇస్తారని తృణమూల్ కాంగ్రెస్ వర్గాలు అంటున్నారు. 292 సీట్లు ఉన్న పశ్చిమబెంగాల్‌లో మాట్రిజ్ ఓ సర్వే నిర్వహించింది. ఇందులో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇక్కడ పోటీ అంచనాలు అందనంతగా ఉంది. తాజా సర్వేలో పార్టీలే షేక్ అయ్యే అభిప్రాయాలు ప్రజలు చెప్పారు. ఈ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ 43 శాతం ఓట్లతో 140 నుంచి 160 సీట్లను గెలుచుకోగలదు. ప్రతిపక్ష భారతీయ జనతాపార్టీ 41 శాతం ఓట్లతో 130 నుంచి 150 సీట్లు గెలుచుకుంటుంది. రాష్ట్రంలోని ఇతర పార్టీలు 16 శాతం ఓట్లతో 8 నుంచి 16 సీట్లు గెలుచుకోగలవు. పశ్చిమ బెంగాల్‌లో 148 సీట్లు గెలుచుకున్న పార్టీ అధికారంలోకి వస్తుంది. ఈ అభిప్రాయ సేకరణలో టీఎంసీకి 2 శాతం స్వల్ప ఆధిక్యం ఉన్నప్పటికీ ఈ తేడా చాలా తక్కువగా ఉండటంతో ఎన్నికల చిత్రం ఏ క్షణంలోనైనా మారిపోవచ్చు. మమత తరువాత కీలక హోదాలో పార్టీలో ఉన్న అభిషేక్ బెనర్జీ ఈ వ్యాఖ్యలు చేశారు అంటే మమత కచ్చితంగా కాబోయే ప్రధానిగా ఇండియా కూటమి నుంచి రేసులో ఉంటారు అన్నది స్పష్టం అవుతోంది. ఇతర ప్రాంతీయ పార్టీల మద్దతు ఉంటే ఇండియా కూటమి సారధ్యం ఆమెకు దక్కడం కూడా కష్టమేమీ కాదు, మొత్తానికి ఇవన్నీ ఆలోచించే అభిషేక్ బెనర్జీ ఈ కామెంట్స్ చేసి ఉంటారని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## సామాజిక విప్లవ ధీరుడు..అక్షర యోధుడు

# మహాత్మా జ్యోతిబా పూలే




మహాత్మా జ్యోతిబా పూలే భారతదేశంలో సామాజిక సంస్కరణల పితామహుడిగా పేరుగాంచిన ఒక శక్తి. 1827లో మహారాష్ట్రలో జన్మించిన ఆయన, సమాజంలో ఉన్న అజ్ఞానం, అసమానతలు, కులవివక్షలను తొలగించేందుకు తమ జీవితాన్ని అంకితం చేశారు. ఆయన ముఖ్యంగా మహిళల విద్యకు, దళితుల హక్కులకోసం కృషి చేసిన మహనీయుడు. ఆయన తన భార్య సావిత్రిబాయి పూలే సహకారంతో బాలికల కోసం మొదటి పాఠశాలను స్థాపించారు. ఆ కాలంలో మహిళలకు విద్య ఇవ్వడమనేది ఒక గొప్ప విప్లవాత్మక చర్యగా నిలిచింది. సమాజంలో వెనుకబడిన వర్గాలకు విద్యను అందించడం ద్వారా వారి జీవితాలను మార్చాలనే ధృడ సంకల్పంతో ఆయన కృషి చేశారు. జ్యోతిబా పూలే మొదటి నుంచి కులవ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించారు. సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం వంటి విలువలను సమాజంలో వ్యాప్తి చేయడానికి కూడా కృషి చేశారు. సామాజిక న్యాయం కోసం పోరాడేందుకై 1873 వ సంవత్సరంలో "సత్యశోధక సమాజ్" అనే సంస్థను స్థాపించి, పోరాడారు.పూలే జీవితం మనకు సమాజ సేవ యొక్క ప్రాముఖ్యతను తెలియజేయడంతో పాటు, ఆయన చేసిన సేవలు శాశ్వతంగా చరిత్రలో నిలిచిపోయాయి. సమానత్వంతో కూడిన సమాజాన్ని నిర్మించేందుకు ఆయన చూపిన మార్గం దోహదపడుతుంది.ఆయన కాలంలో సమాజం కులాల ఆధారంగా విభజించబడి, దిగువ కులాల ప్రజలు అన్యాయానికి, అణచివేతకు గురయ్యారు. జ్యోతిబా పూలే కులవ్యవస్థను ఒక సామాజిక అన్యాయంగా భావించారు.

బ్రాహ్మణాధిక్యాన్ని నిర్ద్వందంగా విమర్శిస్తూ, సమాజంలో అందరికీ సమాన హక్కులు ఉండాలని భావించారు. అందుకు దిగువ కులాల వారికి విద్యా అవకాశాలు లేకపోవడమే ప్రధాన సమస్యగా గుర్తించారు. తక్షణమే వారికి విద్యను అందించడానికి పాఠశాలలను ప్రారంభించారు.తన సంస్థ ద్వారా కులవివక్షను వ్యతిరేకిస్తూ, సమానత్వం, సత్యం, న్యాయం వంటి విలువలను ప్రజల్లో వ్యాప్తి చేశారు. ఈ సమాజం/సంస్థ బ్రాహ్మణేతరులకు ఆత్మగౌరవాన్ని కలిగించే ఉద్యమంగా మారింది.ఆయన పోరాటం కేవలం మాటలకే పరిమితం కాలేదు, ఆయన కార్యాచరణలో కూడా సమానత్వాన్ని పాటించారు. దిగువ కులాల ప్రజల కోసం మంచి నీటి బావులను నిర్మించి, వారికి నీటి సౌకర్యం కల్పించే ఒక విప్లవాత్మక చర్యను చేపట్టి, సమాజంలో తిరుగులేని శక్తిగా ఎదిగారు.మహాత్మా జ్యోతిబా పూలే ఆనాడు కులవ్యవస్థపై చేసిన పోరాటం భారత సమాజంలో గొప్ప మార్పులకు దారి తీసింది. ఆయన ఆలోచనలు ఇప్పటికీ దేశంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడేవారికి ప్రేరణగా నిలుస్తున్నాయనడంలో సందేహం లేదు. ఈసందర్భంలో వారి సతీమణి సావ్రిత్రిబాఇ పూలే గారిని ప్రస్తావించకుండా ఉండలేము. ఆమె భారతదేశంలో మహిళా సాధికారతకు కృషిచేస్తున్నవారికి మార్గదర్శకురాలిగా నిలిచారు. ఆమె పాత్ర జ్యోతిబా పూలే ఉద్యమంలో అత్యంత కీలకమైనది. సావిత్రిబాయి పూలే భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందారు. 1848లో ఆమె, తన భర్తతో కలిసి బాలికల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించారు. ఆ కాలంలో మహిళలు చదవడం నిషేధంగా భావించబడినప్పటికీ, ఆమె ధైర్యంగా విద్యను అందించి ఒక సామాజిక విప్లవానికి నాంది పలికిందని చెప్పవచ్చు. సావిత్రిబాయి కేవలం ఉపాధ్యాయురాలిగానే కాకుండా, మహిళల హక్కుల కోసం పోరాడిన యోధురాలు. బాల్యవివాహం, సతి, కులవివక్ష వంటి చెడు ఆచారాలను ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. ఆమె మహిళలకు ఆత్మగౌరవం, స్వాభిమానంతో జీవించాలనే భావనను కలిగించారు. సమాజం నుంచి వచ్చిన వ్యతిరేకతను, అవమానాలను ఎదుర్కొంటూ కూడా ఆమె తన సేవలను ఆపలేదు. ఆమెకు ఎదురైన కష్టాలు ఆమె సంకల్పాన్ని మరింత బలపరిచాయి. మొత్తంగా, సావిత్రిబాయి పూలే గారి పాత్ర జ్యోతిబా పూలే ఉద్యమానికి బలమైన ఆధారమని చెప్పవచ్చు. మహాత్మా ఝ్యోతిరఒ ఫులె ఆలోచనలు మరియు సంస్కరణలు నేటి జీవనశైలిపై గొప్ప ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఈ రోజుల్లో మన జీవితాల్లో ముఖ్య భాగంగా మారిన సమానత్వం, విద్య, సామాజిక న్యాయం వంటి విలువలను పూలే ఆరోజుల్లోని ప్రోత్సహించారు. ఆయన విద్యకు ఇచ్చిన ప్రాధాన్యత నేటి సమాజంలో స్పష్టంగా కనిపిస్తుంది. మహిళలు, వెనుకబడిన వర్గాలు చదువు ద్వారా ఎదగడానికి అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇది ఖచ్చితంగా ఆయన ప్రారంభించిన విద్యా ఉద్యమం వల్లే సాధ్యమైంది. అంతే కాకుండా కులవ్యవస్థపై ఆయన చేసిన పోరాటం నేటి సమాజంలో సమానత్వ భావనను పెంచింది. కులవివక్ష తగ్గుతూ, అందరికీ సమాన హక్కులు ఉండాలనే ఆలోచన బలపడింది. ప్రభుత్వ విధానాలు, రిజర్వేషన్లు వంటి చర్యలు తప్పకుండా ఈ ఆలోచనల ప్రభావమే. అలాగే మహిళా సాధికారతలో కూడా ఆయన ప్రభావం గొప్పది. మహిళలు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో ముందుకు రావడానికి ఆయన ఆలోచనలు ప్రేరణగా నిలిచాయి. ఆయన భార్య శవిత్రిబై ఫులె చేసిన సేవలు కూడా ఈ మార్పుకు బలాన్నిచ్చాయి. చివరగా, సామాజిక న్యాయం, మానవ హక్కులపై నేటి అవగాహనకు పూలే గారి ఆలోచనలు మార్గదర్శకం అయ్యాయి. మొత్తంగా, జ్యోతిబా పూలే గారి ప్రభావం నేటి జీవనశైలిలో ప్రతి రంగంలో కనిపిస్తూ, సమానత్వం మరియు న్యాయం వైపు మన భారత సమాజాన్ని నడిపిస్తోందనే చెప్పాలి.

**ఎప్రిల్ 11,2026 మహాత్మ జ్యోతీబా పూలే గారి 199 జయంతి సందర్భంగా..**



-జక్కుల రాజు
సామాజిక కార్యకర్త, స్వతంత్ర పాత్రికేయుడు.

## ఆన్లైన్ బూస్టర్ సిస్టమ్ పనితీరును పరిశీలించిన కలెక్టర్



నిజామాబాద్, ఏప్రిల్ 10 : (తెలంగాణ వాణి ప్రతినిధి): మారుమూల నివాస ప్రాంతాలకు సైతం రక్షిత మంచి నీటిని అందించేందుకు వీలుగా ఎడపల్లి మండలం జానకంపేట వద్ద ఏర్పాటు చేసిన ఆన్లైన్ బూస్టర్ సిస్టమ్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం సందర్శించారు. దీని పనితీరు, ప్రయోజనాల గురించి గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిట్టచివరన ఉండే ఆవాసాలకు కూడా తాగునీరు చేరుకునేందుకు ఈ విధానం దోహదపడుతుందని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అనంతగిరి, పోచారం గ్రామాలకు సైతం తాగునీటి సరఫరా కోసం ఇదేతరహా ఏర్పాట్లు చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుత వేసవిలో జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తుగానేచర్యలు చేపడుతున్నామని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. ప్రతి ఆవాస ప్రాంతానికి రక్షిత మంచి నీరు సరఫరా అయ్యేలా పక్కాగా పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్.డబ్ల్యూ.ఎస్ ఈ.ఈ లు రాకేష్, స్వప్న తదితరులు ఉన్నారు.

## పోషణ అభియాన్‌తో ఆరోగ్య మెరుగుదలే లక్ష్యం: ఎమ్మెల్యే



నిర్మల్-భైంసా, ఏప్రిల్ 10(తెలంగాణ వాణి ప్రతినిధి): గర్భిణీలు, బాలింతలు,చిన్నారుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే పోషణ అభియాన్ లక్ష్యమని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పేర్కొన్నారు. భైంసా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ రోజు నిర్వహించిన పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బందికి అందించిన మొబైల్ ఫోన్ల ద్వారా పోషణ,ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను తక్షణమే నమోదు చేసి ప్రభుత్వానికి చేరవేయడం సులభతరం అవుతుందని తెలిపారు. దీని ద్వారా సేవల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసుల కిరాతక చర్యలకు ఓ హెచ్చరిక

**తమిళనాడు మధురై కోర్టు తీర్పుపై సర్వత్రా చర్చ**
**పోలీసులపై పనిభారం తగ్గించాలని సూచనలు**

విజయవాడ,ఏప్రిల్10 :ఆరేళ్ళ క్రితం తమిళనాడులో జరిగిన 'లాకప్ డెత్' కేసులో ట్రయల్ కోర్టు విచారణ ముగిసి తొమ్మిది మంది పోలీసులను ముద్దాయిలుగా ఖరారు చేస్తూ వారందరికీ మరణ శిక్ష విధించడం సంచలనం కలిగించింది. ఈ తీర్పుపై ఇప్పుడు సర్వత్రా చర్చ సాగుతోంది. పోలీసుల అతిపై కోర్టు సరైన తీర్పు ఇచ్చిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలాగే స్టేషన్‌లో టార్చర్ పెట్టే వారికి ఈ కేసు ఓ హెచ్చరికగా సూచిస్తున్నారు. ఇక వివరాల్లోకి వెళితే...కరోనా సమయంలో సదరు లాక్‌డౌన్ నిబంధనల్ని అతిక్రమించారన్న కారణంతో చిరు వ్యాపారులైన తండ్రీకొడుకులను అరెస్ట్ చేశారు. వారిని ఆ రాత్రంతా చిత్రహింసలకు గురిచేయగా ప్రాణాలు కోల్పోయారు. కస్టడీ లోకి తీసుకున్న ఆరోగ్యవంతులైన ఇద్దరు పౌరులు ఒక్క రోజులోనే అనారోగ్యంతో మరణించడానికి పోలీసులు పెట్టిన చిత్రవధ ఏకైక కారణం అన్నది తేలిపోయింది. ఆ దుర్మార్గపు చర్య ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, ఆందోళన నింపగా మద్రాస్ హైకోర్టు సుమోటోగా కేసుని స్వీకరించి?సిబిఐ దర్యాప్తునకు ఆదేశించింది. ఫలితంగా పోలీసుల నేరం నిరూపణ అయ్యింది. బాధాకరమైన విషయమేమిటంటే ఆ మృతులిద్దరూ కరోనా లాక్‌డౌన్ నిబంధనల్ని కూడా అతిక్రమించలేదని. అది కూడా తప్పుడు బనాయింపు అని. ఆ సంఘటనకి బాధ్యులైన 9 మంది పోలీసు అధికారులకూ నేడు కోర్టు మరణ శిక్ష విధించడం సరైన తీర్పు. ఇంకా పైకోర్టులో అప్పీళ్లు, న్యాయ పక్రియలు పూర్తయ్యి అంతిమ తీర్పు రావడం ఎలాఉన్నా ప్రస్తుతానికి బాధిత కుటుంబాలకు ఊరట. అధికారాన్ని అడ్డుపెట్టుకుని,చేయగూడని పనులు చేసే అధికారులకు ఇది ఒక హెచ్చరిక. ఇదే సమయంలో దేశం పోలీసు సంస్కరణల దిశగా ఆలోచించాలి. వారు ఎదుర్కొంటున్న విపరీత పని ఒత్తిడి సమస్య, సిబ్బంది లేమి, దర్యాప్తు, శాంతి భద్రతలను వేర్వేరుగా నిర్వహించే యంత్రాంగం లాంటివి తీర్చుతూనే, తప్పుడు పనులు చేసే అధికారుల్ని వెంటనే కఠినంగా శిక్షించే ఏర్పాట్లు ఉండాలని అంటున్నారు. సమాజానికి అప్పుడే శాంతిభద్రతలకు భరోసా ఉంటుందని భావిస్తున్నారు.

# టూరిజం కార్పొరేషన్ ఉద్యోగుల వయోపరిమితి పెంపునకు వినతి




హైదరాబాద్, ఏప్రిల్ 10 (తెలంగాణ వాణి స్టేట్ కోఆర్డినేటర్) తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితిని ప్రస్తుతమున్న నిబంధనల నుండి 61 సంవత్సరాలకు పెంచాలని కార్మిక సంఘం నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణి ప్రసాద్‌ను సంఘం గౌరవ అధ్యక్షులు చాడ వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి నేతృత్వంలోని ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం అందజేసింది. రాష్ట్రంలోని ఇతర ప్రభుత్వ విభాగాల మాదిరిగానే టూరిజం ఉద్యోగులకు కూడా వయోపరిమితి పెంపు ప్రయోజనం కల్పించాలని వారు ఈ సందర్భంగా కోరారు. అలాగే, టూరిజం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచినందుకు మేనేజ్‌మెంట్‌కు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వేతన పెంపుతో పాటు కార్మికుల ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని గ్రాడ్యుటీ మొత్తాన్ని కూడా పెంచాలని అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సిహెచ్ రాజయ్య, ఉడత రమేష్, రాజశేఖర్, బల్వీర్, తిరుపతి, భద్రన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పాముకాటులో బాలిక మృతి

## ఆస్పత్రికి తరలించే లోపే హరీమన్న ప్రాణం

కాకినాడ,ఏప్రిల్10 : యు.కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు కోనపాపపేటలో విషాద ఘటన చోటు చేసుకుంది. పాము కాటుకు గురై చప్పా దీపిక(13) అనే బాలిక మృతి చెందింది. ఇంట్లో మంచం మీద నిద్రిస్తుండగా రాత్రి 2.30 సమయంలో బాలికను త్రాచుపాము కరిచింది. ఎలుక కరిచిందని భావించి తల్లి మల్లీశ్వరికి చెప్పగా ఉదయం ఆసుపత్రికి వెళ్ళి ఇంజెక్షన్ చేయిద్దామని చెప్పడంతో మరలా బాలిక నిద్రించింది.

అయితే తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇబ్బందిగా ఉందని బాలిక చెప్పడంతో ఆసుపత్రికి తీసుకెల్దామని బంధువులను పిలిచింది. అప్పటికే బాలికకు నోటి వెంట నురగలు రావడంతో అంబులెన్స్‌కు కుటుంబసభ్యులు సమాచారం అందించారు. ఆసుపత్రిలో వివరాల కోసమని ఆధార్ కార్డు వెతుకుతుండగా మంచం పక్కనే తాచుపాము కనిపించడంతో కుటుంబసభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు. పాము కరిచిందని నిర్ధారించుకుని హుటాహుటిన బాలికను ఆస్పత్రికి తరలించాలని భావించగా.. అంబులెన్స్ వచ్చేలోపే పరిస్థితి విషమించడంతో దీపిక ప్రాణాలు కోల్పోయింది. ఇటీవలే కోనపాపపేటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి పరీక్షలు రాసి తొమ్మిదో తరగతిలోకి దీపిక ప్రవేశించింది. బాలిక మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



# సత్యమేవ రేవతి!

'చట్టం ముందు అందరూ సమానులే' అనే మాట సినిమాల్లో వినడమే తప్ప జీవితంలో చూసింది లేదు. సత్యమేవ జయతే అనే నినాదం రాతల్లో తప్ప వాస్తవంగా గెలిచే సందర్భాలు బహు స్వల్పం. ఆ అరుదైన సందర్భాల్లో అరుదైన ఘటన తమిళనాడులో జరిగింది. పోలీస్ లాకప్‌లో తీవ్రమైన హింసకు ఇద్దరు అమాయకులు చనిపోయారు. ఆ హింసను కళ్లారా చూసిన ఓ హెడ్ కానిస్టేబుల్ చెప్పిన నిజం.. సత్యాన్ని గెలిపించింది. ఉన్నతాధికారుల వేధింపులు, బెదిరింపులకు లొంగకుండా ఆమె నిజం వైపే నిలబడింది. నిందితు లు సాక్ష్యాలను మాయం చేసినా.. తన తెలివితో నిజాన్ని నిగ్గు తేల్చి సత్యమేవ జయతే.. అని నినదించింది హెడ్ కానిస్టేబుల్ రేవతి.

2020 జూన్ 19... తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా శాతంకుళం పట్టణం. జనమంతా కొవిడ్ మహమ్మారి భయంతో బతుకుతున్నారు. ప్రభుత్వం లాక్‌డౌన్‌ను కొంత సడలించింది. నిర్దుష్టమైన సమయాల్లో దుకాణాలు తెరిచేందుకు కొవిడ్ ఆంక్షలను పాక్షికంగా ఎత్తివేసింది. సెల్‌ఫోన్ షాప్ నడిపే పి.జయరాజ్ నిబంధనలు ఉల్లంఘించాడని పోలీసులు అరెస్ట్ చేశారు. అతణ్ని శాతంకుళం పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు.

సామాన్యుడి ప్రతిఘటన: పోలీస్ లాకప్‌లో ఉన్న జయరాజ్ కోసం అతని కొడుకు బెనిక్స్ వచ్చాడు. ఆ సమయంలో తండ్రిని దూషిస్తూ కానిస్టేబుల్ చిందులేస్తున్నాడు. తండ్రిని కొడుతున్న కానిస్టేబుల్‌ని బెనిక్స్ అడ్డుకోబోయాడు. వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ తోపులాటలో కానిస్టేబుల్ చొక్కా గుండీ ఊడి కిందపడింది. ఆ కానిస్టేబుల్ అహం నిద్రలేచింది. పట్టలేనంత కోపంతో ఆ తండ్రీ కొడుకుల మీద క్రూరంగా దాడి చేశాడు. ఒకరు కాదు ఇద్దరు కాదు ఒకరి తర్వాత ఒకరు లాఠీలు పుచ్చుకుని వారిపై దాడి చేశారు.

లాఠీ కాఠిన్యం: ఆ రోజు హెడ్ కానిస్టేబుల్ రేవతి పోలీస్ స్టేషన్‌లో సెంట్రీ విధుల్లో ఉంది. ఆ నాలుగు గోడల మధ్య జరుగుతున్న క్రూరమైన దాడికి తండ్రీకొడుకులు చేస్తున్న హాహాకారాలు ఆమె చెవుల్లో పడ్డాయి. వాళ్ల ఆర్తనాదాలు వింటూ ఉండలేక వారిని హింసిస్తున్న గదిలోకి వెళ్లింది. అప్పటికే బెనిక్స్, జయరాజ్ పోలీసు దెబ్బలకు రక్తమోడుతూ ఉన్నారు. ఈ దాడిని ఆపేందుకు రేవతి పోలీసులకు అడ్డు చెప్పింది. వాళ్లు వినిపించుకోలేదు. దాడి ఆపలేదు. ఒళ్లుపగిలేటట్టు, లాఠీలు విరిగేటట్టు కొట్టారు. వృద్ధుడనే కనికరం కూడా చూపలేదు. విలవిల్లాడుతూ ప్రాణం కోసం వాళ్లు చేస్తున్న ఆర్తనాదాలు ఆమె వినలేకపోయింది. అక్కడ ఉండలేక బయటికి వెళ్లిపోయింది. లాకప్ నెత్తుటి మడుగైంది. తీవ్రమైన గాయాలతో తండ్రీ, కొడుకులు ఏడుస్తున్నారు. బెనిక్స్ కదల్లేని స్థితిలో ఉన్నాడు. ఆ రక్తపు మరకలు తుడవాలని ఒక సబ్-ఇన్స్‌పెక్టర్ బెనిక్స్‌ని బెదిరించాడు. మళ్లీ దెబ్బలు పడతాయనే భయంతో ఒంటి మీద బనియన్ విప్పి ఆ మరకలు తుడిచాడు ఆ కుర్రాడు.

తండ్రీకొడుకులకు: ఆ నిద్రలేని రాత్రి భారంగా తెల్లారింది. ఇద్దరినీ పోలీస్ కస్టడీ నుంచి జ్యుడీషియల్ కస్టడీకి పంపించారు. రెండు రోజులకే వాళ్ల పరిస్థితి విషమించింది. ఒక్క రోజు వ్యవధిలో ఇద్దరూ కన్నుమూశారు. దెబ్బలవల్లే చనిపోయారనిపోస్టుమార్టం రిపోర్ట్ వచ్చింది. పోలీసు దెబ్బలకే చనిపోయారని కుటుంబం, ప్రజలు ఆరోపించారు. పోలీసు కేసు నమోదైంది. దర్యాప్తు మొదలైంది. పోలీసుల కళ్లు కప్పడానికి నేరస్తులు సీసీ కెమెరా విజువల్స్‌ని డిలీట్ చేస్తారు. సాక్ష్యాలు మాయం చేస్తారు. ఇక్కడ పోలీసులే నిందితులు.

కాబట్టి చేయకూడని పని చేశారు. దర్యాప్తు అధికారులకు సీసీ కెమెరా ఫుటేజీలో ఏమీ దొరకలేదు. జయరాజ్‌ని అరెస్ట్ చేసిన రోజు విధుల్లో ఉన్న పోలీసులు విచారణకు రావాలని పోలీసులు నోటీసులు ఇచ్చారు. అవి రేవతికి కూడా అందాయి.

వేధింపుల పర్వం..: దర్యాప్తు అధికారులకు అబద్ధం చెప్పమని పోలీసులు రేవతిపై ఒత్తిడి తెచ్చారు. ఈ కేసులో ఉన్న ఇద్దరు అధికారులు ఆమెను పోలీస్ స్టేషన్ బయట వ్యక్తిగతంగా కలిశారు. ఆ తండ్రీ కొడుకులపై చిత్రహింసలు జరిగినప్పుడు వాళ్లు పోలీస్ స్టేషన్‌లో లేరని సాక్ష్యం చెప్పాలని వేడుకున్నారు. అసత్యం చెప్పడానికి ఆమె మనసు అంగీకరించలేదు. వాళ్ల విజ్ఞప్తిని తిరస్కరించింది. ఆ తర్వాత పై అధికారుల నుంచి పిలుపు రావడం, బెదిరింపులు, బుజ్జగింపులు అన్నీ జరిగాయి. వేటికీ లొంగలేదు రేవతి. జరిగిందే చెప్పాలన్న తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. '21 ఏళ్ల సర్వీసులో నాపై ఒక్క రిమార్క్ లేదు. సర్వీస్‌లో ఎప్పుడూ తప్పు చేయలేదు. ఇక ముందు కూడా అలాగే ఉండాలని నిర్ణయించుకున్నాను' అని వాళ్లతో కుండబద్దలు కొట్టినట్టుగా చెప్పింది. సీసీ టీవీ ఫుటేజీని మాయం చేసినా.. ప్రతిక్షణం ఏమి జరిగిందో మర్చిపోకుండా గుర్తుపెట్టుకుందామె. తన జ్ఞాపకాల్లోని ఆ సంఘటనల వరుస క్రమాన్ని దర్యాప్తు అధికారులకు చెప్పింది. వారికి పోలీస్ స్టేషన్ గోడలపై, బల్ల కింద ఉన్న రక్తపు మరకలు చూపించింది. ఫోరెన్సిక్ రిపోర్టులో ఆ రక్తపు మరకలుజయరాజ్, బెనిక్స్ డీఎన్ఏతోసరిపోలడంతో హత్య ఎక్కడ జరిగిందో తేలింది. ఇక ఎవరు చేశారో తేల్చే పని మిగిలింది.

వ్యవస్థపై ఒంటరి పోరాటం!: పని చేస్తున్న వ్యవస్థలో.. 'అధికారులకు విధేయంగా పని చేయాలా? చట్టానికి కట్టుబడి ఉండాలా? నిర్భయంగా బాధ్యతలు నిర్వర్తించాలా?' అనే సందిగ్ధం, ఒత్తిడి, ఉద్యోగం పోతుందనే భయం. మనిషినే మాయం చేస్తారనే ఆందోళనతో ఆమె తీవ్రమైన మనోవేదనకు గురైంది. అంత సంక్షోభంలోనూ రేవతి అబద్ధం చెప్పలేదు. మదురై జిల్లా, సెషన్స్ కోర్ట్ బోనులో నిలుచుని పోలీస్ స్టేషన్‌లో జరిగిందంతా పూసగుచ్చినట్టు చెప్పింది రేవతి. అబద్ధం చెప్పమని పోలీసులు, ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తున్నా.. రేవతి నిజం కోసం నిలబడింది. ఇన్‌స్పెక్టర్, ఇద్దరు సబ్-ఇన్‌స్పెక్టర్‌లు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల తప్పుని ఎత్తి చూపడం చిన్న విషయం కాదు. ఇది కొందరు వ్యక్తులతో పోరాటం కాదు. వ్యవస్థతో యుద్ధం. ఈ పోరాటంలో రేవతి అలసిపోయింది. బెదిరింపులు, వేధింపులకు గురైంది. పోలీస్ స్టేషన్‌లో సాక్ష్యాలు చెరపడానికి నీళ్లు తేవాలని ఆదేశిస్తే తెచ్చింది. కానీ, కోర్టులో నిజం చెప్పాల్సి వచ్చినప్పుడు నిజమే చెప్పింది. అబద్ధం చెప్పడానికి రేవతి మనస్సాక్షి ఒప్పుకోలేదు. ఎన్నిసార్లు చెప్పినా, ఎంతమంది అధికారులు ఒత్తిడి చేసినా రేవతి మనసు మార్చుకోలేదు. నిజం మారదు కదా! కాబట్టి నిజాన్నే చెప్పాలనే ఆమె ఆలోచనా మారలేదు. కోర్టులో జరిగిందే చెప్పింది. చూసిందే చెప్పింది. నిందితులందరనీ దోషులుగా నిరూపించింది.

న్యాయం గెలిచిన రోజు: ఇద్దరు అమాయకుల మరణాలకు కారణమైన తొమ్మిది మందికి మరణశిక్ష పడింది. 'ఈ పోరాటంలో అలసిపోయిన నాకు మా కుటుంబం మద్దతుగా నిలబడింది. నాకు ధైర్యం చెప్పి నాతోడుగా ఉంది. నాకు అండగా ఉన్న కుటుంబానికి హాని జరగకుండా కాపాడేందుకు నా ఇద్దరు బిడ్డలకు, భర్తకు పోలీస్ భద్రత కల్పించాలని ఆదేశించడంతో ప్రభుత్వం భద్రత కల్పించింది' అని తీర్పు తర్వాత మీడియాతో ఆ చీకటి రోజుల్ని గుర్తుచేసుకుంటూ చెప్పిందామె. రేవతి నిజాయతీకి గుర్తింపుగా ప్రమోషన్ ఇవ్వాలని, ఆమె నిర్భీతికి పోలీసు పతాకం ఇవ్వాలని తమిళనాడు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆ ప్రభుత్వానికి రేవతికి ఉన్నంత నిజాయతీ ఉంటే తప్పకుండా ప్రజల కోరిక నెరవేరుతుంది.

ఇది నేను చూసింది. ఇదే నేను: కోర్టులో చెప్పిన నిజం. నేను నిజం చెప్పక పోయినా కోర్టు నిజం తెలుసుకునేదేమో. అప్పుడు నేను కూడా ఆ నేరంలో భాగమయ్యేదాన్ని. దోషిగా మిగిలిపోయేదాన్ని. సత్యంకోసం నిలబడినందుకు, కోర్టులో సాక్ష్యం చెప్పినందుకు నేను పడినబాధలు ఆ దేవుడికి, నాకుమాత్రమే తెలుసు. పోలీసులకు కుటుంబాలు ఉంటాయి. ఆ కుటుంబ సభ్యులపట్ల సానుభూతి ఉంది. కానీ, పోలీసులు క్రూరంగా ప్రవర్తించకూడదు కదా!

# గుండెపోటును గుర్తించండి



మహిళల్లో గుండెపోటు భిన్నంగా కనిపిస్తుంది. వారిలో అలసట, ఆయాసం, వీపు పైభాగంలో నొప్పి, వికారం, గుండెదడ వంటి లక్షణాలతో ఉంటుంది. అయితే, చాలామంది ఈ లక్షణాలను గుండెపోటుగా భావించడం లేదట. వేరే సమస్యలుగా పొరబడుతున్నారట. దాంతో, మహిళల్లో గుండెపోటు మరణాలు పెరుగుతున్నాయని 'జర్నల్ ఆఫ్ ది అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ'లో తాజాగా ప్రచురితమైన ఒక అధ్యయనం వెల్లడించింది. మహిళల్లో హృద్రోగ సమస్యలపై చేపట్టిన ఈ అధ్యయనం.. అనేక ఆసక్తికర విషయాలను బయట పెట్టింది. ఈ అధ్యయనం కోసం అమెరికా మిన్నెసోటాలోని ఓల్మేస్టెడ్ కౌంటీలో గుండెపోటుకు గురైన 1,474 మంది హెల్త్ డేటాను పరిశీలించారు. వీరంతా 65 ఏళ్లలోపు వయసు గలవారే. ఆడవాళ్లలో గుండెపోటు రావడానికి అత్యంత స్పష్టమైన కారణం.. స్పాంటేనియస్ కరోనరీ ఆర్టరీ డిసెక్షన్. ఇది కరోనరీ ధమని గోడలో ఏర్పడే ఒక చీలిక. దీనివల్ల రక్తనాళంలోని పొరల మధ్య రక్తం చిక్కుకుపోయి, గుండెకు రక్త ప్రవాహం తగ్గుతుంది. కొన్ని సందర్భాల్లో పూర్తిగా ఆగిపోతుంది. అది గుండెపోటుకు దారితీస్తుంది. పురుషులతో పోలిస్తే మహిళల్లో ఈ సమస్య ఆరు రెట్లు ఎక్కువగా ఉంది. కాబట్టి, ఈ సమస్యను గుర్తిస్తే.. మహిళల్లో గుండెపోటు మరణాలు సంభవించకుండా అడ్డుకోవచ్చని అంటున్నారు.

## యాసంగి రైతు భరోసా, మెంతా తుఫాన్ నష్టపరిహార చెక్కుల దిక్కేలేదు



హుస్నాబాద్ ఏప్రిల్ 10 (తెలంగాణ వాణి ఆర్ సి): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల మొండి వైఖరి అవలంబిస్తుంది యాసంగి నాట్లు పూర్తవుతున్న ఇప్పటివరకు రైతు భరోసా సంబంధించి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని భారతీయ జనతా పార్టీ హుస్నాబాద్ మండల అధ్యక్షులు భూక్య సంపత్ ఆరోపించారు. వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో అకాల వర్షాలకు పత్తి,మక్కా, వరి పంటలకు సంబంధించి రైతులకు మెంతా తుఫాన్ తో అసలు పెట్టుబడి కూడా రాకుండా పోయిందని, క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు సర్వే చేసి సంబంధిత రైతుల పాసుపుస్తకం బ్యాంకు ఖాతా జిరాక్స్ తీసుకొని మళ్లీ రబి సీజన్ వచ్చినా నష్టపరిహారం చెక్కుల జాడే లేదుని, సన్న వడ్లకు బోనస్ ఇస్తామని గత ఖరీఫ్ రవి సీజన్లో సంబంధించి ఇప్పటివరకు బోనస్ డబ్బులు జమ కాలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసారు.

# కూటమి ధీమా వెనుక కథేంటీ



ఒంగోలు, : ఏపీలో ఎన్నికలకు ఇంకా మూడేళ్ల టైమ్ ఉంది. కానీ రాబోయే ఎన్నికలపై ఇప్పటి నుంచే చర్చ జరుగుతోంది. కూటమి లాంగ్ లీవ్ అంటున్న చంద్రబాబు, పవన్.. వైసీపీ మళ్లీ రాదు గాక రాదు అని తెగేసి చెప్తున్నారు. వచ్చే టర్మే కాదు..రాబోయే 30ఏళ్ల వరకు కూడా వైసీపీకి అవకాశమే ఇవ్వము అన్నట్లుగా చెప్పుకొస్తున్నారు. థర్టీ ఇయర్స్ స్థిరమైన నాయకత్వం ఉండేలా ప్లాన్ చేస్తున్నామని అంటున్నారు సీఎ చంద్రబాబు. ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత, అసహనం కలిసి వస్తాయని వైసీపీ దింపుడు కళ్లం ఆశ పెట్టుకుని కూర్చుందని..అది జరగదని క్లియర్ కట్‌గా చెప్పేస్తున్నారు టీడీపీ అధినేత. గత ఎన్నికల కంటే కూటమి..ఎస్పెషల్‌గా టీడీపీ మెరుగైన స్థానంలో ఉన్నట్లుగా చెప్పుకుంటున్నారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు చేసిన ఈ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చుట్టూ ఆసక్తికర చర్చ జరుగుతోందివైసీపీ మళ్లీ అధికారంలోకి రాదు. ఎలా పవర్‌లోకి వస్తారో చూస్తానంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రిపీటెడ్‌గా కామెంట్స్ చేస్తున్నారు. ఓ రకంగా వైసీపీకిఛాలెంజ్ కూడా చేస్తున్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు కూడా సుత్తి లేకుండా సూటిగా చెప్పేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత కలిసి వస్తుందన్న ఆశలు వద్దు. మీకు ఆ ఛాన్స్ ఇవ్వం. అంత సీన్ కూడా లేదంటున్నారు. రాబోయే 30 ఏళ్ల పాటు స్థిరమైన నాయకత్వం ఉండేలా మాస్టర్ స్కెచ్ వేస్తున్నామని..అలా అయితే ఏపీ డెవలప్‌మెంట్ అన్‌స్టాపబుల్ అన్నట్లుగా పరుగులు పెడుతుందని చెప్తున్నారు. వైసీపీ హయాంలో జరిగిన విధ్వంసం నుంచి కోలుకోవడానికే సమయం పడుతుందని..అలాంటిది ఏపీ మిగతా రాష్ట్రాలతో పోటీ పడేలా.. దేశంలో అగ్రగామిగా నిలబడాలంటే..బలమైన, స్థిరమైన నాయకత్వం అవసరమని అంటున్నారుఅయితే ప్రభుత్వ వ్యతిరేకత మీదే వైసీపీ హోప్స్ పెట్టుకుందని ..కానీ అలా జరగనివ్వబోమని చెప్పడం ఇంట్రెస్టింగ్‌గా మారింది. బాబు ఇంత ఔట్ రైట్‌గా ఓ కామెంట్ చేయడం అంటే ఆశామాషీ కాదు. ఆయన థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీగా పాలిటిక్స్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చూసిన నాయకుడు. అలాంటి చంద్రబాబు తమ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత రాదు..రానివ్వమంటూ ధీమా వ్యక్తం చేయడం..ఇండైరెక్ట్‌గా ఫ్యాన్ పార్టీని ఛాలెంజ్ చేయడం పొలిటికల్ హాట్ టాపిక్‌గా మారిందఇంతకు బాబు ధైర్యం వెనుకున్న రహస్యం ఏంటన్నదే డిబేట్ పాయింట్ అవుతుంది. అధికారంలో ఉండి..పైగా ఇంకో మూడేళ్ల పాలన మిగిలి ఉండగానే..వైసీపీ ఎత్తులను పసిగట్టడం ఒక ఎత్తు అయితే..వైసీపీ పెట్టుకున్న ఆశలు అడిఆశలు అవుతాయని చెప్పడం మరో ఎత్తు. అయితే బాబు ఇంత కాన్ఫిడెంట్‌గా ఉండటానికి రీజనేంటి అన్నదే చర్చకు దారితీస్తోంది. నిజానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బాబు..చాలా జాగ్రత్త పడుతున్నారు. ఎక్కడా ప్రజావ్యతిరేకత రాకుండా..ప్రతీ విషయంలో కేర్ తీసుకుంటున్నారు. ఎమ్మెల్యేల పనితీరు అయినా..అభివృద్ధి విషయంలో అయినా..సంక్షేమ పథకాలు అమలులో అయినా..రాజకీయ విమర్శల్లో కూడా ఎక్కడా చిన్న మిస్టేక్ జరగకుండా ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ప్రజా వ్యతిరేకత రాకుండా ప్లాన్ చేసుకోవడం ఒక ఎత్తు అయితే..ఎప్పటికప్పుడు ప్రజలు కూటమి ప్రభుత్వం గురించి ఏమనుకుంటున్నారు? ఏ విషయంలో అసంతృప్తిగా ఉన్నారని పబ్లిక్ పల్స్ తెలుసుకుంటున్నారు. పైగా సంక్షేమ పథకాల విషయంలో ఇచ్చిన మాట ప్రకారం ఒకదాని తర్వాత మరో హామీని అమలు చేసుకుంటూ వస్తున్నారు. ఇప్పటికే కీలక పథకాలన్నింటిని గ్రౌండ్ చేశారు. మిగిలిన చిన్న చితక హామీలేమైనా ఉంటే ఎన్నికల నాటికి అవి కూడా ఇంప్లిమెంట్ చేసే ఆలోచనలో ఉన్నారట. ఈ అన్ని విషయాలపై బేరీజు వేసుకుని..క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకున్నాకే చంద్రబాబు భరోసా పెరిగిందన్న టాక్ వినిపిస్తోంది. ఏదైనా వైసీపీని టార్గెట్ చేస్తూ టీడీపీ అధినేత చేసిన వ్యాఖ్యలు అయితే ఏపీ పాలిటిక్స్‌లో ఇంట్రెస్టింగ్ డిస్కషన్‌కు దారితీశాయి.

## కూల్చి వేసిన స్కూల్ ను పరిశీలించిన బి జె పీ శ్రేణులు



పటాన్ చెరు, ఏప్రిల్ 10, (తెలంగాణ వాణి రిపోర్టర్); పటాన్ చెరు పట్టణం లోని 1974-75 లో నిర్మించిన పురాతనమైన జడ్పిహెచ్ఎస్ హై స్కూల్ ను నేషనల్ హైవే రోడ్డు పైకి వస్తుందని సాకుతో స్కూల్ బిల్డింగ్ కూల గొట్టిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజిరెడ్డి డిమాండ్ చేశారు. ఆమె ఆధ్వర్యంలో ఈ రోజు ఒక బృందం స్కూల్ ను సందర్శించింది. 1974- 75 సమయంలో నిర్మించిన ఈ జిల్లా పరిషత్ హై స్కూల్ ను కబ్జా దారులు కూల్చివేసిన సంఘటన ఉమ్మడి జిల్లా లో గతంలో ఎక్కడా జరుగ లేదన్నారు. ఈ స్కూల్లో ఈ ప్రాంత సీనియర్ రాజకీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే, ప్రజెంట్ ఎమ్మెల్యే, ఎం ఎల్ సీ ల తో పాటు ఎంతో మంది అధికారులు స్కూల్లో చదువు కొని గౌరవ పదమైన పదవుల్లో ఉన్నారన్నారు. అయినా ఈ స్కూల్ గురించి పట్టించుకునే నాథుడే లేరన్నారు. అయినా ఎట్టి పరిస్థితిలో భారతీయ జనతా పార్టీ జిల్లా కమిటీ, పట్టణ నాయకులు ఈ అంశాన్ని వదిలి పెట్టేది లేదని జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోల్కూర్ రాజశేఖర్ రెడ్డి, బైండ్ల కుమార్, ప్రసాద్, శివ కుమార్ యాదవ్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు....

# 28న గూగుల్ డేటా సెంటర్ కు శంకుస్థాపన



విశాఖపట్టణం, : రాష్ట్రంలో ప్రతిష్టాత్మక గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. విశాఖపట్నం జిల్లాలో ఈ నెల 28వ తేదీన శంకుస్థాపన చేయనున్నారు. ఈ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ తో పాటు గూగుల్ సంస్థకు చెందిన ప్రముఖులు హాజరుకానున్నారు. అంతర్జాతీయ దిగ్గజ సంస్థ గూగుల్ అమెరికావెలుపల అత్యధిక పెట్టు బడి 15 బిలియన్ డాలర్ల (రూ. 1.35 లక్షల కోట్లకు పైగా) వ్యయంతో చేపడుతున్న మొదటి ప్రాజెక్టు ఇదే కావడం విశేషం. వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ను నిర్మించనున్నారు. 2028 చివరికి డేటా సెంటర్ పనులు పూర్తి చేసి, ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెబుతున్నారు. గూగుల్ డేటా సెంటర్కు మూడు చోట్ల మొత్తం 601.4 ఎకరాలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. విశాఖ జిల్లా ఆనందపురం తర్లువాడలో 266.6 ఎకరాలు, విశాఖ గ్రామీణ మండలం అడవివరంలో సింహాచలం దేవస్థానానికి చెందిన 160 ఎకరాలు, అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఏపీఐఐసీకి చెందిన 174.8 ఎకరాలు కేటాయించారు. గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్, అదానీన్రాష్ట్ర భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నారు గూగుల్ సంస్థ ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్ల కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, గూగుల్ సంస్థ గత ఏడాది అక్టోబర్ 14న ఎంవోయూపై సంతకాలు చేశాయి. అవసరమైన భూమిని ప్రభుత్వం గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కు అప్పగించింది. మూడు డేటా సెంటర్ల ఏర్పాటుతో విశాఖపట్నం ఆసియాలోనే అతి పెద్ద డేటా సెంటర్ క్లస్టర్‌గా గుర్తింపు పొందే అవకాశం ఉంది. దీనికోసం 601.40 ఎకరాలను ప్రభుత్వం ఇప్పటికే కేటాయించింది. విశాఖ పట్టణం తీర ప్రాంతం కావడంతో ఇక్కడి నుండి సింగపూర్, మలేషి యా, ఆస్ట్రేలియా వంటి దేశాలకు సముద్రగర్భ కేబుల్ వ్యవస్థల ద్వారా నేరుగాఅనుసంధానం ఏర్పడుతుంది. దీనివల్ల విశాఖ నగరం అంత ర్జాతీయ డేటా కనెక్టివిటీ ప్రధాన కేంద్రంగా మారనుంది.

# అందం కోసం అతివద్దు



అందం, ఆరోగ్యం కోసమే.. చర్మ సంరక్షణ చర్యలు చేపట్టాలి. అయితే, కొందరు స్కిన్‌కేర్ అతిగా తీసుకుంటారు. మరికొందరు తప్పుడు పద్ధతులు పాటిస్తుంటారు. దీనివల్ల మేలు కన్నా, చర్మానికి కీడే కలుగుతుంది. కాబట్టి, స్కిన్ కేర్ రొటీన్ చర్మానికి హాని కలిగిస్తుంటే.. కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖం మీది జిడ్డు పోవాలని రోజుకు నాలుగైదు సార్లు ముఖాన్ని కడుతుగుతుంటారు. సబ్బులు, ఫేస్‌వాష్‌లతో రుద్దేస్తుంటారు. ఇలా చేయడం వల్ల చర్మంలోని సహజమైన నూనెలు తొలగిపోతాయి. ఫలితంగా, చర్మం పొడిబారిపోతుంది. మంట పుడుతుంది. కొందరు ఒకేసారి వివిధ రకాల ఉత్పత్తులు వాడుతుంటారు. సీరమ్స్, క్రీములు, టోనర్లు ఒకేసారి వాడటం వల్ల.. వాటిలోని రసాయనాలు ఒకదానితో ఒకటి కలిసి చర్మంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా రెటినోల్, విటమిన్ సి వంటి శక్తిమంతమైన పదార్థాలను కలిపి వాడేటప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలి. ఇక చర్మ తత్వానికి సరిపడని ఉత్పత్తులు వాడటం కూడా మంచిదికాదు. జిడ్డు చర్మం ఉన్నవారు పొడిచర్మం కోసం తయారుచేసిన క్రీములు వాడితే.. చర్మ రంధ్రాలు మూసుకుపోతాయి. మొటిమలు వస్తాయి. అలాగే చర్మానికి పడని రసాయనాలు, సువాసనలు కలిగిన ఉత్పత్తులతో అలర్జీలు దాడిచేస్తాయి. చర్మం మరింత కాంతిమంతంగా మెరవాలని.. స్క్రబ్స్, కెమికల్ పీల్స్ ఎక్కువగా వాడుతుంటారు. దీనివల్ల చర్మంపై ఉండే రక్షణ కవచం దెబ్బతింటుంది. ఫలితంగా, చర్మం ఎర్రబడటం, సున్నితంగా మారడం, చిన్న చిన్న మొటిమలు రావడం లాంటి సమస్యలు ఎదురవుతాయి. ఎంత ఖరీదైన ఉత్పత్తులు వాడినా.. పగటిపూట సన్‌స్క్రీన్ వాడకపోతే ఎలాంటి ఫలితం ఉండదు. పైగా, కొన్ని స్కిన్‌కేర్ ఉత్పత్తులు ఎండలో చర్మాన్ని మరింత సున్నితంగా మారుస్తాయి.

ఇలా గుర్తించాలి..: ఏదైనా ఉత్పత్తిని రాసుకున్నప్పుడు చర్మం మండుతు ఇన్నట్లు అనిపిస్తే.. సదరు ఉత్పత్తి మీకు పడటం లేదని అర్థం చేసుకోవాలి. దాన్ని పక్కన పెట్టేయాలి. చర్మం విపరీతంగా పొడిబారిపో యినా, పొట్టు రాలినా, హఠాత్తుగా మొటిమలు వచ్చినా చర్మానికి హాని కలుగుతున్నట్లు గుర్తించాలి. ఇలా, చర్మంపై ఏదైనా కొత్త మార్పు కనిపిస్తే, వెంటనే స్కిన్‌కేర్ రొటీన్‌ను ఆపేయాలి. ఆయా ఉత్పత్తులను పక్కన పెట్టేసి.. కొన్ని రోజులపాటు తక్కువ రసాయనాలు ఉన్న మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్ లాంటివే వాడాలి. సమస్య తగ్గకపోతే బ్యుటీషియన్, డెర్మటాలజిస్టును సంప్రదించాలి.

# ఘుమఘుమల గాలి వంట!



వంటగ్యాస్ కొండెక్కి కూర్చుంది. ఇలాంటి సమయంలో ఎలక్ట్రిక్ వంట సామగ్రే మనల్ని ఆదుకుంటుంది. అన్నం కోసం ఎలక్ట్రిక్ కుక్కర్ ఉండనే ఉంది. ఇక ఎయిర్ ఫ్రైయర్‌లో కూరల్ని వండుకోవడం.. చాలా రోజుల్నుంచే అలవాటైంది. అయితే, ఎయిర్ ఫ్రైయర్‌ను వాడేటప్పుడు కొన్ని చిట్కాలు తప్పకుండా పాటించాలి. లేకుంటే, ఆహారం రుచి తగ్గుతుంది. మిషన్ కూడా త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుంది. ఎయిర్ ఫ్రైయర్‌లో వంట కోసం నూనె అక్కర్లేదని అనుకుంటారు. కానీ, నూనె లేకుంటే ఆహారం పొడిపొడిగా మారిపోతుంది. ఇక నూనెను నేరుగా బాస్కెట్‌లోనే పోయడం కూడా కరెక్ట్ కాదు. ఆహారపదార్థాలకు నూనెను బ్రష్‌తో రాయడం,స్ప్రే చేయడం మంచిది. దీనివల్ల వండిన పదార్థాలు బయట క్రిస్పీగా, లోపల జ్యూసీగా తయారవుతాయి. ఓవెన్ మాదిరిగానే ఎయిర్ ఫ్రైయర్‌ను కూడా.. వాడటానికి ముందు కనీసం 3నుంచి 5 నిమిషాలు ప్రీహీట్ చేయాలి. లేకుంటే, ఆహారం బాగా వేగడానికి ఎక్కువ సమయం పడుతుంది. చాలామంది చేసే అతిపెద్ద తప్పు.. బాస్కెట్‌ను పూర్తిగా నింపేయడం. ఎయిర్ ఫ్రైయర్ అంటేనే.. వేడిగాలి ద్వారా పనిచేస్తుంది. బాస్కెట్‌లో పదార్థాలను నింపేయడం, ఒకదానిపై ఒకటి వేయడం చేస్తే.. గాలి సరిగ్గా ప్రసరించదు. దాంతో, పదార్థాలు సరిగ్గా ఉడకవు. కొన్నిచోట్ల మెత్తగా, మరికొన్ని చోట్ల పచ్చిగా ఉంటుంది. దీనికి పరిష్కారం.. బాస్కెట్‌లో తక్కువ పదార్థాలు ఉండేలా చూసుకోవాలి. ఒకే పొరలా పరుచుకోవాలి. పదార్థాలను ఎయిర్ ఫ్రైయర్‌లో పెట్టేసి.. పూర్తయ్యేదాకా అటువైపు చూడరు. కానీ, ఆహారాన్ని మధ్యలో కలిపితేనే.. అన్నివైపులా ఉడుకుతుంది. కాబట్టి, వంట సమయం సగం పూర్తయ్యాక.. ఒకసారి బాస్కెట్ తీసి ఆహారాన్ని కలపాలి. పకోడీలు, బజ్జీలు లాంటివి చేయడానికి పల్చని పిండి మిశ్రమాలను ఎయిర్ ఫ్రైయర్‌లో నేరుగా వేయకూడదు. దీనివల్ల పిండి కిందికి కారిపోతుంది. గాలి ప్రసరణకు అడ్డుపడుతుంది. కాబట్టి, పకోడీలు, బజ్జీలు వేసుకోవడానికి పిండి కొంచెం గట్టిగా ఉండేలా చూసుకోవాలి. ఎయిర్ ఫ్రైయర్‌ను వాడిన ప్రతిసారి దాన్ని శుభ్రం చేయాలి. బాస్కెట్ కింద పేరుకుపోయే నూనెలు, పదార్థాల అవశేషాలను తొలగించాలి. లేకుంటే, తర్వాతి వంట చేసేటప్పుడు.. అవి కాలిపోయి పొగ వస్తుంది. ఇక ఎయిర్ ఫ్రైయర్‌ను శుభ్రం చేయడానికి మెత్తని స్పాంజ్ వాడాలి. లేకుంటే, లోపల ఉండే నాన్ స్టిక్ కోటింగ్ దెబ్బతినే అవకాశం ఉంటుంది.

# స్టీల్ బ్యాంక్.. ప్లాస్టిక్ రహిత గ్రామంగా ఆదర్శం

నిజామాబాద్, ఏప్రిల్ 10,: సోషల్ మీడియాను తెగ తిడుతుంటాం. అందర్నీ పాడు చేస్తోందని. కానీ కోవిడ్ లాంటి సమయాల్లో, లేదా క్లిష్టమైన సమయాల్లో సోషల్ మీడియానే ప్రముఖ పాత్ర పోషించింది. అనేక ముఖ్యమైన సమాచారాలు, ఆరోగ్య సమాచారాలు, ఇతరులకు సేవ చేసే విషయాలు ఈ వేదిక ద్వారానే ప్రపంచానికి తెలిసాయి. అంతేకాకుండా చాలా మంచి మంచి విషయాలను కూడా సోషల్ మీడియా సమాజం ముందుకు తెస్తుంది. దీంతో సమాజానికి చాలా మేలు చేకూరుతుంది. తాజాగా ఇలాంటి ఓ వార్తే సోషల్ మీడియాలో వచ్చింది. దీంతో ఊరు ఊరంతా మారిపోయింది. పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించింది ఆ గ్రామం. గ్రామంలో ఇంతటి మార్పుకు కారణమైంది మన సోషల్ మీడియానే. ఇదంతా జరిగింది బాసర సమీపంలోని గుండంపల్లి గ్రామం. ఈ రోజుల్లో ప్రతిదీ ప్లాస్టిక్ అయ్యింది. దీంతో కాన్సర్ కి కారణం అవుతోంది. ఏ ఫంక్షన్ జరిగినా, చిన్న కార్యక్రమం జరిగినా.. ప్రయాస పడకూడదని ప్లాస్టిక్ విస్తళ్లు, ప్లాస్టిక్ గ్లాసులను ఆర్డర్ ఇచ్చేస్తున్నారు. వాడేస్తున్నారు, పాడేస్తున్నారు. దీంతో మనుషులకు కేన్సర్ లాంటి రోగాలు రావడంతో పాటు వాటిని తిన్న పశువులు కూడా తీవ్ర అనారోగ్యానికి బలి అవుతున్నాయి. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న గుండంపల్లి గ్రామస్థులు అలర్ట్ అయ్యారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 500 స్టీల్ ప్లేట్లు, గ్లాసులతో "స్టీల్ బ్యాంకు"ను ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలో జరిగే ప్రతి శుభకార్యంలోనూ వీటినే ఉపయోగిస్తున్నారు. దీంతో ప్లాస్టిక్ వాడకం తగ్గింది. పర్యావరణ పరిరక్షణలో ఇదో కీలక అడుగుగా భావిస్తున్నారు. శుభ కార్యాల్లో ఇందులోనే తిని, వాటిని ప్రజలే శుభ్రం చేసి, తిరిగి ఇచ్చేస్తున్నారు. అలాగే అనుమతి లేకుండా తమ గ్రామంలో విక్రయిస్తున్న ఐస్ క్రీమ్ లపై కూడా అలర్ట్ అయ్యారు గ్రామస్థులు. వాటిని తమ గ్రామంలోకి అనుమతించకూడదని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. గ్రామ సరిహద్దుల్లోనే ఇలాంటి వాటిని అడ్డుకుంటున్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలను వాడొద్దని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారుగుండంపల్లి గ్రామస్థులందరూ ఐకమత్యంతో స్టీల్ ప్లేట్ల వాడకం, పర్యావరణాన్ని కాపాడలన్న నిర్ణయం తీసుకోవడంతో రాష్ట్రానికి దిక్సూచిగా మారారు. వీరు తీసుకున్న నిర్ణయాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు.

ఏ ప్రభుత్వ అధికారులు చెప్పకపోయినా, స్వచ్ఛందంగా, ప్రకృతిపై వున్న మమకారంతో, తమ ఆరోగ్యం విషయంలో తీసుకునే శ్రద్ధ కారణంగా, అవగాహన కారణంగా ఈ విజయం వరించింది. అలాగే ప్రతి ఇంటి నుంచి కూడా సహకారం లభించడంతో విజయం సాధించారు. ప్రజల్లో చైతన్యం పెరిగితే మార్పు దానంతట అదే వస్తుందని మరోసారి నిరూపితమైంది. ఒక గ్రామంలో 500 స్టీల్ ప్లేట్లు 20 కార్యక్రమాల్లో వాడితే? 10,000 ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగం తగ్గినట్టే. అదే ప్రతి గ్రామం చేస్తే? పర్యావరణానికి ఎంత మేలు జరుగుతుందో ఊహించండి.

# విజయవాడ స్టేడియానికి మహర్దశ

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం అంతర్జాతీయ హంగులు అద్దుకోబోతోంది. రాష్ట్రంలో క్రీడారంగానికి పూర్వవైభవం తీసుకురావాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఈ స్టేడియంను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పునరుద్ధరించాలని నిర్ణయించింది. విజయవాడ నగరాన్ని ఒక స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఇది మొదటి అడుగుగా ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఆధునీకరణ పనులకు సంబంధించి ఈ నెల 8వ తేదీన అధికారికంగా శంకుస్థాపన జరగనుంది. రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఈ కార్యక్రమానికి హాజరై పనులను ప్రారంభించనున్నారు. క్రీడాకారుల కోసం అత్యాధునిక వసతులు మరియు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ఈ భారీ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. పునరుద్ధరణలో భాగంగా స్టేడియంలో అత్యాధునిక రన్నింగ్ ట్రాక్స్, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఇండోర్, అవుట్ డోర్ కోర్టులు నిర్మించనున్నారు. శిక్షణలో ఉండే క్రీడాకారుల కోసం అధునాతన హాస్టల్ సౌకర్యాలు, జిమ్ మరియు ఇతర సాంకేతిక పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. భవిష్యత్తులో జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి ఈవెంట్లకు ఈ స్టేడియం వేదికగా మారనుంది. ప్రపంచ స్థాయి పోటీలకు సరిపడేలా స్టేడియం సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, ప్రతిభ ఉన్న క్రీడాకారులకు స్థానికంగానే అత్యుత్తమ శిక్షణ అందేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల బెజవాడ క్రీడాకారులు మరియు క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్టేడియం అభివృద్ధి కోసం ప్రభుత్వం మొత్తం రూ. 53 కోట్లు వెచ్చించనుంది. ఇందులో మొదటి విడతగా రూ. 30 కోట్లతో పనులను ప్రారంభించనున్నారు. 2027 నాటికి ఈ పనులన్నీ పూర్తి చేసి, 2029లో అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలను ఇక్కడ నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధాన స్టేడియం మధ్యలో 400 మీటర్ల పొడవైన, 8-లేన్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న శాప్ ప్రధాన కార్యాలయాన్ని తొలగించి, ఆ స్థానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను నిర్మించనున్నారు. టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ మరియు కబడ్డీ కోసం అదనంగా కొత్త ఔట్‌డోర్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు.

# నల్లగా ఉన్నాడని ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య..

## మధ్యప్రదేశ్‌లో హనీమూన్ మర్డర్ కేసును మించిన ఘటన



మధ్యప్రదేశ్: మేఘాలయ హనీమూన్ మర్డర్ కేసును మించిన మరో ఘటన మధ్యప్రదేశ్ జిల్లాలో వెలుగు చూసింది. ప్రియుడితో వివాహేతర సంబంధం కారణంగా సుపారీ గ్యాంగ్‌తో భర్తను ఓ భార్య హత్య చేయించింది. ఆ తర్వాత ఏమీ తెలియదన్నట్లుగా భర్త శవం ముందు మొసలికన్నీరు కార్చింది. ఆమెయాక్టింగ్ చూసి అంతా అయ్యో పాపం అనుకున్నారు. కానీ పోలీసులు మాత్రం తెలివిగా ఆమెనే నిందితురాలు అని కనిపెట్టేశారు. మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాకు చెందిన దేవకృష్ణ రోహిత్ (28) సుగంధ ద్రవ్యాల వ్యాపారం చేస్తుంటాడు. అతనికి ప్రియాంక పురోహిత్(25)కి కొంతకాలం కిందట పెళ్లయ్యింది. ఇదిలా ఉంటే ఈ నెల 7వ తేదీన రాత్రి తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో దుండగులు అతనిపై దాడి చేసి అత్యంత కిరాతకంగా హత్య చేశారు. అతని భార్య ప్రియాంక ఇంట్లో కట్టేసి కనిపించింది. ఏం జరిగిందని ఇరుగుపొరుగు, కుటుంబసభ్యులు ఆరా తీయగా కొందరు దుండగులు అకస్మాత్తుగా ఇంట్లోకి చొరబడి తన భర్తపై దాడి చేశారని తెలిపింది. తనను ఓ గదిలో కట్టేశారని.. అరిస్తే చంపేస్తామని పీక మీద కత్తి పెట్టారని పేర్కొంది. ఇంట్లో ఉన్నదంతా దోచేసి, తన భర్తను అన్యాయంగా చంపేశారని కన్నీరుమున్నీరుగా విలపించింది. ఆమె ఏడుపు, చెప్పిన విధానం చూస్తే ఎవరికి అయినా అయ్యో పాపం అని అనిపించేలా సహజంగానే ఉన్నాయి. దీంతో అందరూ ఆమెను నమ్మేశారు. చివరకు పోలీసులు కూడా తొలుత ఆమె చెప్పిందే నిజమని అనుకున్నారు. కానీ దర్యాప్తు చేసే సమయంలో ఇంట్లో దోపిడీ జరిగినట్లుగా ఎక్కడా అనిపించలేదు. దీంతో ప్రియాంకను పోలీసులు మళ్లీ విచారించగా పొంతనలేని సమాధానాలు చెప్పింది. ఆమె కాల్ డేటాను, మొబైల్ లొకేషన్లను పరిశీలించిన పోలీసులు.. కమలేశ్ పురోహిత్ అనే వ్యక్తితో ప్రియాంకకు అక్రమ సంబంధం ఉన్నట్లు గుర్తించారు. అప్పుడు ప్రియాంకను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా.. వివాహేతర సంబంధం కారణంగానే భర్తను అడ్డు తొలగించుకోవాలని అనుకున్నట్లుగా ప్రియాంక బయటపెట్టింది. సురేంద్ర అనే వ్యక్తికి సుపారీ ఇచ్చి హత్య చేయించినట్లు ఒప్పుకుంది. తన భర్త దేవకృష్ణ నల్లగా ఉండటం ఆమెకు నచ్చలేదని తెలిపింది. 'నువ్వు చాలా నల్లగా ఉన్నావు. నాకు అసలు తగవు. నా స్థాయికి తగ్గ మనిషివి కాదు' అంటూ ప్రియాంక తరచూ దేవకృష్ణను అవమానించేదని పోలీసుల విచారణలో తెలిసింది. తన భర్త నల్లగా ఉన్నాడని, తన స్థాయికి అతను సరిపోడని, ఈ క్రమంలో కమలేష్ అనే వ్యక్తితో ఉన్న అక్రమ సంబంధం బయటపడడంతో, అడ్డు తొలగించుకునేందుకు భర్తను హతమార్చినట్లు గుర్తించి నిందితులను అరెస్టు చేసిన పోలీసులు.

# గ్యాస్ ధర భారీగా తగ్గనుందా?

## డొమెస్టిక్, కమర్షియల్.. ఎవరికి ఎంత బెనిఫిట్?



హైదరాబాద్,:గ్యాస్ ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న వినియోగదారులకు త్వరలోనే ఉపశమనం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఒక లేఖ రాస్తూ.. ఎల్‌పిజి, పిఎన్‌జిపై పన్నులను పూర్తిగా తొలగించాలని కోరింది. ఈ ప్రతిపాదన ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ప్రతిపాదన ప్రకారం వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్లపై ఉన్న 18 శాతం జీఎస్‌టిని తొలగిస్తే, ఒక్క సిలిండర్ ధర సుమారు రూ.317 వరకు తగ్గే అవకాశం ఉంది. అదే విధంగా గృహ వినియోగ సిలిండర్లపై ఉన్న 5 శాతం జీఎస్‌టిని రద్దు చేస్తే, ఒక్క సిలిండర్‌పై సుమారు రూ.43 వరకు తగ్గింపు లభించవచ్చు. ఇటీవల ప్రభుత్వం పెంచిన రూ.60 ధరను కూడా ఉపసంహరిస్తే, మొత్తం తగ్గింపు రూ.100 వరకు ఉండే అవకాశముంది. ప్రస్తుతం దేశీయ ఎల్‌పిజి సిలిండర్ ధర సుమారు రూ.913గా ఉంది. దీనిపై ఉన్న 5 శాతం జీఎస్‌టిని తొలగిస్తే, ధర రూ.869 వరకు పడిపోవచ్చు. అదనంగా ధర పెంపును కూడా తగ్గిస్తే, సిలిండర్ ధర రూ.809 వరకు తగ్గే అవకాశం ఉందని అంచనా. సీటీఐ వాదన ప్రకారం.. ఇరాన్, అమెరికా యుద్ధం ప్రభావంతో గ్యాస్ సరఫరా అంతరాయం ఏర్పడింది. దీనివల్ల ధరలు పెరిగి, వినియోగదారులపై భారం పెరిగింది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పన్ను మినహాయింపులు ఇవ్వడం అవసరమని సూచించింది. ఇంకా ఒక ముఖ్య అంశం ఏమిటంటే, పిఎన్‌జి ప్రస్తుతం జీఎస్‌టీ పరిధిలో లేకపోయినా, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే వ్యాట్ వల్ల వినియోగదారులపై అదనపు భారం పడుతోంది. కాబట్టి దీనిపైనా పన్ను తగ్గింపు అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే, గృహ వినియోగదారుల నుంచి వ్యాపార రంగం వరకు అందరికీ గణనీయమైన ఉపశమనం లభించే అవకాశం ఉంది. అయితే, దీనిపై తుది నిర్ణయం కేంద్ర ప్రభుత్వం తీసుకోవాల్సి ఉంది.

# టూరిజం కార్పొరేషన్ ఉద్యోగుల వయోపరిమితి పెంపునకు వినతి




హైదరాబాద్, ఏప్రిల్ 10 (తెలంగాణ వాణి స్టేట్ కోఆర్డినేటర్) తెలంగాణ టూరిజం కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితిని ప్రస్తుతమున్న నిబంధనల నుండి 61 సంవత్సరాలకు పెంచాలని కార్మిక సంఘం నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణి ప్రసాద్‌ను సంఘం గౌరవ అధ్యక్షులు చాడ వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి నేతృత్వంలోని ప్రతినిధి బృందం కలిసి వినతి పత్రం అందజేసింది.

రాష్ట్రంలోని ఇతర ప్రభుత్వ విభాగాల మాదిరిగానే టూరిజం ఉద్యోగులకు కూడా వయోపరిమితి పెంపు ప్రయోజనం కల్పించాలని వారు ఈ సందర్భంగా కోరారు. అలాగే, టూరిజం కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచినందుకు మేనేజ్‌మెంట్‌కు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వేతన పెంపుతో పాటు కార్మికుల ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని గ్రాడ్యుటీ మొత్తాన్ని కూడా పెంచాలని అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సిహెచ్ రాజయ్య, ఉడత రమేష్, రాజశేఖర్, బల్వీర్, తిరుపతి, భద్రన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, ఏప్రిల్ : 10 ( తెలంగాణ వాణి ప్రతినిధి ) : ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న మెరుగైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని హమాలీవాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో హోమియోపతి వైద్య పితామహుడు డాక్టర్ శామ్యూల్ హనీమన్ 271వ జయంతిని పురస్కరించుకుని 'ప్రపంచ హోమియోపతి దినోత్సవ' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయుష్ వైద్య విధానాలైన హోమియోపతి, ఆయుర్వేదం, యునానీ, యోగా ద్వారా దీర్ఘకాలిక వ్యాధులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎలోపతి మందుల వల్ల దుష్ప్రభావాలు ఎదుర్కొనే వారికి హోమియోపతి ఒక అద్భుతమైన ప్రత్యామ్నాయమని ఆయన వివరించారు. ఈ వైద్యంపై తనకున్న నమ్మకాన్ని పంచుకుంటూ, తన వ్యక్తిగత అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రిమ్స్‌లో అందుబాటులో ఉన్న టిఫా స్కాన్, రెగ్యులర్ చెకప్‌లను వినియోగించుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన శిశువుల జననానికి బాటలు వేయవచ్చని కలెక్టర్ సూచించారు.

పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని కోరారు. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందుబాటులో ఉంచుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వ దవాఖానాలు, బస్తీ దవాఖానాల ద్వారా అందుతున్న ఉచిత సేవలను ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

# ఒక యుద్ధం.. అనేక చేదు అనుభవాలు !



ట్రంప్, నెతన్యాహులు కలసి ప్రపంచాన్ని గందరగోళంలోకి నెట్టడమే కాకుండా ఓ రకంగా చెప్పాలంటే ఫూల్స్‌ను చేశారు. ఇరాన్ వద్ద శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని ప్రపంచాన్ని నమ్మించారు. అక్కడి నాయకత్వాన్ని మార్చాలని, తద్వారా యురేనియం స్వాధీనం చేసుకుంటామని అనుకున్నారు. కానీ ఈ రెండూ పక్కకు పోయి, ఇప్పుడు హర్మూజ్ జలసంధ తెరిస్తే చాలన్నట్లుగా వ్యవహారానికి దిగారు. ఇరాన్ బిగుసుకుని కూర్చోవడంతో హర్మూజ్ జలసంధి వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. ఇరాన్‌ను దారిలోకి తెచ్చుకునేందుకు అనూహ్యంగా పాక్‌ను ట్రంప్ రంగంలోకి దింపారు. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం స్వాధీనం చేసుకోవడం.. ఆ దేశంలో ప్రస్తుతం ఉన్న పాలకులను మార్చి తమకు అనుకూలంగా ఉండేవారిని నియమించడం.. అనే రెండు లక్ష్యాలతో అమెరికా, ఇజ్రాయెల్ ఆ దేశంపై యుద్ధాన్ని మొదలుపెట్టాయి. కానీ దాదాపు 40 రోజుల యుద్ధంలో అది నెరవేరలేదు. ఇరాన్ నేత కమేనీ మరణించినా, ఆయన కుమారుడు మరో నేతగా ముందుకు వచ్చారు. అక్కడి ప్రజలు కూడా అమెరికాకు లొంగలేదు. నలభై రోజులు గడిచాక పరిస్థితి చూస్తే.. ఆ రెండు లక్ష్యాలనూ సాధించడంలో ట్రంప్, నెతన్యాహులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. ప్రపంచం కూడా ఇది గుర్తించింది. వాస్తవంగా చెప్పాలంటే.. రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి, వందలాది మంది ప్రాణాలను బలిగొని, ప్రత్యక్షంగా గల్ఫ్ ప్రాంతాన్ని దెబ్బతీయడానికి కారణమయ్యారు. ఇంధన కొరతకు కారణమయ్యారు. పరోక్షంగా,ప్రత్యక్షంగా ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీసారు. ట్రంప్ కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత కూడా ఇరాన్ క్షిపణులను ప్రయోగించడం.. చెక్కుచెదరని ఆ దేశ రాజకీయ నాయకత్వ సంకల్ప బలానికి, ఆ దేశ సైనిక సామర్థ్యానికి నిదర్శనమని రక్షణ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక శక్తిమంతమైన దేశం చిన్నదేశంపై విరుచుకుపడి.. పూర్తిగా ఓడించలేకపోతే, అది ఆ చిన్నదేశం విజయం కిందే పరిగణించాలి. ఆ కోణంలో చూస్తే ఇరాన్‌ను ఈ యుద్ధంలో విజేతగానే చూడాలి. ఎందుకంటే సర్వనాశనం చేస్తామన్న ట్రంప్ తోక ముడిచారనే చెప్పాలి. స్వదేశంలో ట్రంప్ విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. అలాగని ఈ యుద్ధంలో ఇరాన్ సంపూర్ణంగా గెలిచిందని కూడా చెప్పలేం. ఎందుకంటే ఇరాన్ భారీగానే నష్టపోయింది. అది కుదురుకోవడానికి మరో దశాబ్దం పట్టవచ్చు. ఎందుకంటే.. ఎంతో మంది ఇరాన్ పౌరులు ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. ఆ దేశంలోని మౌలికసదుపాయాలు, చమురు క్షేత్రాలు, పారిశ్రామిక కేంద్రాలు దారుణంగా దెబ్బతిన్నాయి. దేశ అగ్ర నాయకత్వాన్ని ఇరాన్ కోల్పోయింది. ఆ దేశ అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇరాన్‌కన్నా ఎక్కువగా ఈ యుద్ధంలో నష్టపోయింది గల్ఫ్ దేశాలు. యూఏఈ, సౌదీ, కువైత్, ఇరాక్, బహరైన్‌లోని పలు ప్రాంతాలు ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్క యూఏఈపైనే ఇరాన్ దాదాపు 520 క్షిపణులు, 2000 కామికాజీ డ్రోన్లను ప్రయోగించింది. దీంతో, యూఏఈకి ఆర్థిక ఇంజన్లు అయిన దుబాయ్, షార్జా వంటివి తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దుబాయ్ పర్యాటక, రియల్ ఎస్టేట్ రంగాలు కుప్పకూలాయి. అటు.. సౌదీ వద్దనున్న అత్యాధునిక అమెరికన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్.. ఇరాన్ దాడులను పూర్తిగా అడ్డుకోలేకపోయాయి. ఫలితంగా సౌదీలోని రాస్‌తనూరా వంటి చమురుశుద్ధి కర్మాగారాలు, పలు పారిశ్రామిక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ కాస్త తగ్గి, చర్చలకు రావడానికి.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేసిన ఈ దాడులు కూడా ఒక కారణం. ఈ యుద్ధం వల్ల అమెరికా ఆర్థికంగా నష్టపోవడమే కాదు. ఆ దేశ పరపతి కూడా పోయింది. ఇకపై అమెరికా సైనికశక్తిని చూసి గతంలో భయపడినట్టుగా ఎవరూ భయపడే పరిస్థితి ఉండదు. ఇకపోతే యుద్ధం జరుగుతుండగా.. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టుబిగించి, రాకపోకలను కట్టడి చేయడంతో ఓ రకంగా చెప్పాంటే ట్రంప్‌కు ముచ్చెమటలు పట్టాయనే చెప్పాలి. అంతేగాకుండా ఇరాన్ ఎదురుదాడిని కూడా అమెరికా ఊహించి ఉండలేదు. నోటికొచ్చినట్టు మాట్లాడిన ట్రంప్.. ఇప్పుడు హోర్ముజ్ జలసంధిని తెరవాలంటూ పదేపదే బెదిరింపులు జారీ చేశారు. అదీ జరగలేదు. యుద్ధం మొదలైనరోజే సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ చనిపోయినా.. ఆయన కుమారుడు మొజ్తబాకు పట్టంగట్టి ఇరాన్ ఈ యుద్ధాన్ని కొనసాగించింది. కాలక్రమంలో అగ్రనాయకులు ఎందరు మరణించినా.. యుద్ధాన్ని మాత్రం ఆపలేదు! ఓ రకంగా చెప్పాలంటే అమెరికాను సవాల్ చేసింది. ఒక దశలో తన దూకుడుతో అమెరికావిమానవాహక యుద్ధనౌకను సైతం వెనక్కి తగ్గేలా చేసింది. మా మీదకి దాడికి వస్తే.. ఈ ప్రాంతంలో నీ మిత్రదేశాలను నేను దెబ్బతీస్తా అని గల్ఫ్ దేశాలకు ముడిపెట్టి హెచ్చరించింది. దాడులు చేసి అమెరికాను నిలువరించ గలిగేలా ఎదురుదాడులతో బెంబేలు పెట్టింది. అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యాన్ని, అత్యాధునిక సాంకేతికత కలిగిన ఇజ్రాయెల్‌ను ఎదుర్కొని ఇరాన్ తన ఉనికిని కాపాడుకుంది. బెరుకు లేకుండా యుద్ధం లోకి దిగింది. ఇప్పుడు లెబనాన్‌పై దాడులను ఆపకుంటే హొర్మూజ్ తెరిచేది లేదని ఉడుంపట్టు పట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కలసి ఇరాన్‌లోని అణు కేంద్రాలను ధ్వంసం చేసి ఉండవచ్చు. కానీ ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను మాత్రం స్వాధీనం చేసుకోలేకపోయాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌కు గతంలో లేని పట్టు ఇప్పుడు రావడానికి ఈ యుద్ధమే కారణ మైంది. ఇప్పుడా మార్గంలో టోల్ వసూలు ప్రతిపాదన ద్వారా దానిపై శాశ్వత నియంత్రణకు ఇరాన్ ప్రయత్నాలు చేస్తోంది. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును కొనసాగించి, పూర్తిగా నియంత్రించ గలిగితే.. ఆ దారి గుండా ఎగుమతి, దిగుమతులకు యూఏఈ పూర్తిగా ఇరాన్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

## మై బెల్లీని పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**మాజీ సర్పంచ్ సంపూర్ణ సంగ్రామ్ పటేల్**



జహీరాబాద్/ ఝరాసంగం: ఏప్రిల్ 10(తెలంగాణ వాణి) కాంగ్రెస్ పార్టీ కమల్ పల్లీ మాజీ సర్పంచ్ సంపూర్ణ సంగ్రామ్ పటేల్ మాజీ ఎంపీటీసీ మారుతి రావు పటేల్, ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న మై బెల్లిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన విషయం తెలుసుకొని గురువారం నాడు హైదరాబాద్ పట్టణం లో రెంటుకు ఉంటున్న రూముకి వెళ్లి పరామర్శించిన అనంతరం మాజీ సర్పంచ్ సంపూర్ణ సంగ్రామ్ పాటేల్, మాట్లాడుతూ మై బెల్లి తర్వాగా కోలుకోవాలని మంచి ఆరోగ్యం తో బయటకు రావాలని కోరుతున్నాను అని తెలిపారు. అనంతరం మైబెల్లి కుమారుడైన ముక్తర్ మాట్లాడుతూ మా నాన్న యొక్క ఆరోగ్య పరిస్థితి బాగాలేదని తెలుసుకుని మా రూము వరకు వచ్చి మాతో మాట్లాడి మా కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ఇచ్చినందుకు వారికి మా కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మారుతి రావు పాటిల్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమజంట ఆత్మహత్య

**ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి**

పల్నాడు,ఏప్రిల్10 : కొండవీడు కోటలో ఓ ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమ ప్రేమ విహహాన్ని తల్లిదండ్రులు నిరాకరించడంతో తీవ్ర మనస్తాపం చెందిన ప్రేమజంట పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. యువతీ, యువకుడు ప్రేమించుకోగా.. వారి ప్రేమను పెద్దలు నిరాకరించారు. యువతికి తల్లిదండ్రులు వేరే వ్యక్తితో వివాహం జరిపించారు. దీంతో ఆమె తీవ్రంగా మనస్తాపానికి గురైంది. పెళ్లి అయిన తర్వాత కూడా ప్రేమించిన వ్యక్తిని మరిచిపోలేక... భర్తను వదిలేసి ప్రేమికుడి వద్దకు వచ్చేసిందా యువతి. ఇద్దరు కలిసి జీవించాలని అనుకున్నప్పటికీ పెద్దలు తమ వివాహాన్ని అంగీకరించరని భావించిన ప్రేమజంట కఠిన నిర్ణయం తీసుకుంది. ఈనెల 7న కొండవీడు కోటకు వచ్చిన వీరిద్దరు.. అక్కడే పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. వెంటనే గమనించిన స్థానికులు వారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరూ చనిపోయారు. వీరిద్దరూ గుంటూరుకు చెందిన వారుగా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రేమ జంట మృతిపై వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

# ఘనంగా కేఎస్ పీపీ 4వ స్నాతకోత్సవం

**ముఖ్య అతిథిగా నీతి ఆయోగ్ పూర్వ సీఈవో**
**35 మంది కి పట్టాల ప్రదానం**
**నలుగురు ప్రతిభావంతులకు బంగారు పతకాలు బహుకరణ**

పటాన్ చెరు, ఏప్రిల్ 10, (తెలంగాణ వాణి రిపోర్టర్): కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్ పీపీ) తన నాలుగో స్నాతకోత్సవాన్ని ఏప్రిల్ 10, 2026 న హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం ఒక లాంఛన ప్రాయ విద్యా ఊరేగింపు (అకడమిక్ ప్రొసెషన్)తో ప్రారంభమై, సందర్భానికి తగ్గ గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించింది. ఈ వేడుకలో నీతి ఆయోగ్ పూర్వ ముఖ్య కార్య నిర్వహణాధికారి, భారతదేశపు జీ-20 షెర్పా అమితాబ్ కాంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తన ప్రసంగంలో, ఆయన నూతన ఆవిష్కరణలు, సమగ్రత, దేశ నిర్మాణానికి ప్రాధాన్యత నిస్తూ, ప్రజా విధానం, పరిపాలనకు అర్థవంతంగా దోహద పడాలని పట్ట భద్రులైన విద్యార్థులను ప్రేరేపించారు. క్షేత్రస్థాయి పరిపాలన ప్రాముఖ్యతను హైలైట్ చేస్తూ, భారతదేశ సమాఖ్య నిర్మాణంలో కీలకమైన రాష్ట్రాలు, జిల్లాలతో మమేకమవ్వాలని అమితాబ్ కాంత్ విద్యార్థులను కోరారు. తయారీ రంగంలో వాటాను పెంచడం, వ్యాపార వ్యయాన్ని తగ్గించడం ద్వారా భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. 'జన విశ్వాస్' (ప్రజా విశ్వాసం) కు ప్రాధాన్యతనిస్తూ, ఎగుమతులను పెంచడానికి, భారతదేశ ప్రపంచ పోటీతత్వాన్ని మెరుగు పరచడానికి విశ్వాసాన్ని బలపేతం చేయడం, వ్యాపార పరిస్థితులను మెరుగుపరచడం చాలా కీలకమన్నారు. భారతదేశ జనాభాలో దాదాపు 46 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని పేర్కొంటూ, వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచడం యొక్క ప్రాముఖ్యతను కూడా వివరించారు. ప్రపంచ ప్రమాణాలతో భారతదేశ వ్యవసాయ, పారిశ్రామిక పని తీరును బేరీజు వేసుకోవాలని ఆయన పట్టభద్రులను



ప్రోత్సహించారు. బలమైన ఆవిష్కరణ వ్యవస్థ కోసం పిలుపునిస్తూ, పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించాలని, స్టార్టప్ లకు మద్దతు ఇవ్వాలని, రిస్క్ క్యాపిటల్ ను పొందేందుకు వీలు కల్పించాలని అమితాబ్ కాంత్ విద్యార్థులను కోరారు. 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న భారతదేశ ఆశయాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ఈ దార్శనికతను సాధించడంలో యువ నిపుణులు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. భారతదేశ పురోగతిని గురించి ప్రస్తావిస్తూ, మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధనం, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలలో వేగవంతమైన పురోగతిని ఆయన ఉదహరించారు. డిజిటల్ చెల్లింపులలో నాయకత్వం, కోడివ్-19 వ్యాక్సినేషన్ల వంటి భారీస్థాయి ప్రజా సేవల పంపిణీని కూడా ఆయన ప్రస్తావించారు. కృత్రిమ మేధస్సు, ఆరోగ్య సంరక్షణ, పోషణ వంటి రంగాలలో డిజిటల్ పబ్లిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) యొక్క పరివర్తనాత్మక సామర్థ్యాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. వర్తమాన కాలాన్ని 'భారతదేశ దశాబ్దం'గా అభివర్ణిస్తూ, అమితాబ్ కాంత్ దేశానికి ఉన్న జనాభా పరమైన ఆధిక్యతను ఎత్తిచూపుతూ, పట్టభద్రులు ఆశావాదం తో, నూతన ఆవిష్కరణతో, దేశ నిర్మాణానికి కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. తొలుత, ముఖ్య అతిథి, ఇతర ప్రముఖులు సాంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలన చేయడంతో ఈ వేడుక లాంఛనంగా ప్రారంభమైంది. గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ తన అధ్యక్షోపన్యాసంలో, పట్టభద్రులను అభినందించి, ముఖ్య అతిథిని సత్కరించారు. కేఎస్ పీపీ సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ కన్వాల్ అమితాబ్ ను పరిచయం చేశారు. గీతం హైదరాబాదు అదనపు ఉ



ప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు విద్యార్థి ప్రతినిధి సెహాజానా కాంట్రాక్టర్ తో ప్రమాణ స్వీకారం ప్రతిని అందించి, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 35 మంది విద్యార్థులకు వారి డిగ్రీలతో పాటు, విద్యా నైపుణ్యాన్ని గుర్తించే మెరిట్ పతకాలను ప్రదానం చేశారు. పబ్లిక్ పాలసీ మాస్టర్స్ ప్రోగ్రామ్ లో మొదటి ర్యాంకు సాధించిన అభిజీత్ సుధీర్ రౌత్ కు అధ్యక్షుడి పేరిట నెలకొల్పిన బంగారు పతకం ఇచ్చి సత్కరించారు. ఉత్తమ క్యాప్ స్టోన్ ప్రాజెక్టుకు గాను సిమ్రాన్ కౌర్ డీన్ బంగారు పతకాన్ని అందుకున్నారు. యనమండ్ర మల్లికార్జున రావు స్మారక బంగారు పతకాన్ని అభిజీత్ సుధీర్ రౌత్, అమల్ శుక్లాలకు సంయుక్తంగా ప్రదానం చేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్, గీతం ఉప కులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా సంతకం కోసం డిగ్రీ రికార్డులను సమర్పించారు. విద్యార్థి ప్రతినిధి అనుష్క శర్మ స్నాతకోత్సవ ప్రసంగం చేయగా, కేఎస్ పీపీ అధ్యాపకురాలు డాక్టర్ వసుధా కడ్జు వందన సమర్పణ చేశారు. కేఎస్ పీపీ డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అక్బరుద్దీన్ కూడా పాల్గొన్నారు. పబ్లిక్ పాలసీ, పరిపాలన రంగంలో తమ వృత్తి ప్రస్థానాన్ని ప్రారంభించనున్న పట్టభద్రుల బృందానికి ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.

## కోరుట్లలో ప్లాస్టిక్ రహిత తనిఖీలు..

**రూ. 12 వేల జరిమానా విధింపు**



కోరుట్ల : పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీందర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మెరుపు దాడులు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్‌లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ప్రభుత్వం నిషేధించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడుతున్నట్లు గుర్తించిన అధికారులు, సదరు యజమానులకు మొత్తం రూ. 12,000 జరిమానా విధించారు. అదేవిధంగా, అపరిశుభ్రంగా నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ?ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ..

బట్ట సంచులను వాడాలని సూచన..: పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వ్యాపారులు పూర్తిస్థాయిలో నిషేధించాలని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలతో పాటు దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. గడువు ముగిసిన వారు వెంటనే ట్రేడ్ లైసెన్స్‌ను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా బట్ట సంచులను వాడాలని అధికారులు వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ తనిఖీలోశానిటరీఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్,ఇన్‌చార్జ్‌శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, రికార్డ్ అసిస్టెంట్ జగదీష్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లు మహేష్, హేమంత్, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# 'మంథని పుష్కర ఘాటు వద్ద హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలి': కలెక్టర్



పెద్దపల్లి: పుష్కరాల ఘాట్లకు వెళ్లే రోడ్లను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఇంజనీరింగ్ చీఫ్ మోహన్ నాయక్ తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని మంథని, గోలివాడ గోదావరిఖని పుష్కర ఘాట్లకు వెళ్లే రహదారులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని, పుష్కరాల సమయంలో గోలివాడ సమ్మక్క సారలమ్మ జాతర వద్ద రోజుకు 30 వేల మంది భక్తులు వస్తారనే అంచనా తో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

రెండు లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉంది..: గోదావరిఖని సమ్మక్క సారలమ్మ జాతర వద్ద 50 శాతం వరకు శాశ్వత పనులు పూర్తయ్యాయని, అక్కడ స్నానాల ఘాట్, కళ్యాణ కట్ట, పిండ ప్రధానం చేసే స్థలం ఏర్పాటు పనులు రోజుకు లక్ష మంది భక్తులు వచ్చిన తట్టుకునేలా చేపట్టాలన్నారు. సుందిళ్ల గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం వద్ద రోడ్ల మరమ్మత్తు పనులు, బ్యారేజీ వద్ద రోడ్డు డబుల్ లైన్ చేయాలన్నారు. మంథని గౌతమేశ్వర ఆలయం వద్ద గోదావరి పుష్కరాల సమయంలో రోజుకు రెండు లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఇక్కడ సురబండేశ్వర్ స్వామి టెంపుల్ నుండి శివాలయం వరకు ఉన్న ఘాట్ వద్ద ఇన్ ఁ ఔట్ ఏర్పాట్లు చేయాలని అన్నారు. మంథని పట్టణంలోని అన్ని దేవాలయాలకు అంతర్గత రోడ్లు నిర్మించాలని, పుష్కర ఘాటు వద్ద హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సిరిసపల్లి డంపింగ్ యార్డ్‌పై కొనసాగుతున్న పోరు..

హుజురాబాద్ రూరల్: హుజురాబాద్ మండలం సిరిసపల్లి శివారులో ప్రభుత్వం ఏర్పాటు చేయ తలపెట్టిన డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటం ఉధృతమవుతోంది. స్థానిక ప్రజలు చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 19వ రోజుకు చేరుకున్నాయి. ఈ ఉద్యమానికి మద్దతుగా పట్టణ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ??ఈ సందర్భంగా లారీ అసోసియేషన్ అధ్యక్షులు కప్పల రాజయ్య మాట్లాడుతూ.. జనావాసాల మధ్య డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. చెత్త కుప్పల నుండి వెలువడే రసాయనాల వల్ల భూములు నిస్సారమవడమే కాకుండా, భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ ప్రాంతంలోని గాలి కలుషితమై పిల్లలు, వృద్ధులు తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులు ఇతర అనారోగ్యాల బారిన పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా మొండిగా ముందుకు వెళ్లడం సరికాదని, తక్షణమే ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ?నిరసన దీక్షలో లారీ అసోసియేషన్ ప్రతినిధులు, యజమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉపాధ్యక్షులు అహ్మద్, సెక్రెటరీ మజీద్, జాయింట్ సెక్రెటరీ మునీర్, క్యాషియర్ జనార్దన్ రెడ్డి.సలీం, మల్లయ్య, హరి శంకర్, యూసుఫ్, ముప్పు శ్రీనివాస్, ఐలయ్య, శ్రీనివాస్, కార్తీక్, రాజయ్య, సుధాకర్, సాజిత్, జానీ బాయ్, హాలీం తదితరులు ఉన్నారు.

## ఎన్ఎస్పీ కాల్వలో ఈతకు వెళ్లి యువకుడు గల్లంతు

ఖమ్మం ఏప్రిల్ 10 : ఈత సరదా ఒక విద్యార్థి ప్రాణాల మీదకు తెచ్చిన సంఘటన శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఏదులాపురం గ్రామానికి చెందిన పదో తరగతి పరీక్షలు రాస్తున్న ఐదుగురు విద్యార్థులు స్నేహితుడు పుట్టినరోజు పురస్కరించుకుని గ్రామ సమీపంలోని గొల్లగూడెం సమీపంలోని ఎన్ఎస్పి కాల్వలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈతకు వెళ్లిన ఐదుగురు స్నేహితుల్లో పుట్టబంతి రామకృష్ణ అనే యువకుడు గల్లంతయ్యాడు. ఉమేష్, వరుణ్ సందేశ్, సందీప్, బాలాజీతో కలిసి ఈతకు వెళ్లిన రామకృష్ణకు ఈత రాకపోవడంతో నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న స్థానికులు, కుటుంబ సభ్యులు కాల్వ వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.




# 'ఐరెన్ లెగ్' ముద్ర బాధాకరం



టాలీవుడ్ యంగ్ హీరోయిన్ కృతి శెట్టి తన కెరీర్‌లో ఎదుర్కొంటున్న విమర్శలపైతాజాగా స్పందించారు. నటిగా ప్రతి సినిమాలోనూ తాను వంద శాతం శ్రమిస్తానని, పాత్రకు న్యాయం చేయడానికి ఎలాంటి రాజీ పడనని చెప్పారు. అయితే సినిమా ఫలితం మాత్రం పూర్తిగా తన చేతిలో ఉండదని, అలాంటి పరిస్థితుల్లో 'ఐరెన్ లెగ్' అని ముద్ర వేయడం తనను తీవ్రంగా బాధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా హిట్ అవుతుందా, ఫ్లాప్ అవుతుందా అనేది అనేక అంశాలపై ఆధారపడి ఉంటుందని, కేవలం తనను లక్ష్యంగా చేసు కుని విమర్శిం చడం సరైంది కాదని ఆమె పేర్కొన్నారు. కొన్నిసార్లు కేవలం అదృష్టం లేకపోవడం వల్ల అవకాశాలు కోల్పోవడం ఒక నటిగా తనను కృంగదీస్తోందని తెలిపారు. ప్రస్తుతం తాను నటిస్తున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రంపై కూడా కొన్ని సందేహాలు వ్యక్తమవుతున్నాయని, అవి తనను కలచివేస్తున్నాయని కృతి వెల్లడిం చారు. అయినప్పటికీ తన కృషిని మాత్రం ఎప్పటికీ ఆపబోనని, మంచి కథలతో ప్రేక్షకులను అలరించడానికి ప్రయత్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. ఈ చిత్రంలో తాను 'ధీమా' అనే పాత్రలో కనిపించనున్నట్లు కృతి చెప్పారు. సోషల్ మీడియాకు బానిసైన, 'నోమోఫోబియా'తో బాధపడే యువతిగా నటించడం తనకు కొత్త అనుభూతిని ఇచ్చిందని తెలిపారు. కథ 2040 నేపథ్యంతో సాగుతున్నప్పటికీ, ప్రస్తుత సమాజానికి బాగా కనెక్ట్ అవుతుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. సినిమా షూటింగ్ సమయంలో ప్రముఖ నటి నయనతారతో తనకు మంచి అనుబంధం ఏర్పడిందని కృతి తెలిపారు. ఒక సందర్భంలో తనకు సమస్య ఎదురైనప్పుడు నయనతార స్వయంగా ఫోన్ చేసి గైడ్ చేసిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. ఇక సోషల్ మీడియాలో వచ్చే నెగటివ్ ట్రోల్స్‌పై కూడా కృతి స్పందించారు. విమర్శలు చేసే వారు తమ ఆలోచనా ధోరణి మార్చుకోవాలని, పాజిటివ్‌గా ఆలోచించడం చాలా ముఖ్యం అని సూచించారు. తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతూ, తాను పాతకాలపు ప్రేమకే ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. ప్రస్తుతం తన పూర్తి దృష్టి నటనపైనే ఉందని, మరో ఐదు నుంచి పది సంవత్సరాల తర్వాత డేటింగ్ చేసి పెళ్లి గురించి ఆలోచిస్తానని వెల్లడించారు. అనీల్ రావిపూడి సినిమాతో పాటు తమిళ, హిందీ భాషల్లో పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నట్లు తెలిపారు.

# బాక్సాఫీస్ దగ్గర దూసుకెళ్తున్న 'ధురంధర్ 2'



భారీ అంచనాల మధ్య విడుదలైన 'ధురంధర్ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుత ప్రదర్శనతో ప్రభంజనం సృష్టిస్తోంది. విడుదలైన మూడు వారాల్లోనే దాదాపు రూ. 1700 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించిన ఈ సినిమా, త్వరలోనే రూ. 1800 కోట్ల మార్కును అందుకునే దిశగా దూసుకెళ్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రానికి మంచి ఆదరణ లభిస్తుండగా, ఇప్పటికీ అనేక థియేటర్లలో డీసెంట్ కలెక్షన్లతో తన సత్తాను కొనసాగిస్తోంది. అయితే ఐపీఎల్ సీజన్ ప్రభావం, అలాగే సినిమా సుదీర్ఘమైన రన్‌టైమ్ కారణంగా రూ. 2000 కోట్ల మైలురాయిని చేరుకోవడం కాస్త కష్టంగా కనిపిస్తోంది. అయినప్పటికీ, ప్రస్తుత వసూళ్ల దృష్ట్యా ఇది ఇప్పటికే ఇండస్ట్రీ హిట్ దిశగా పయనిస్తున్న చిత్రంగా ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇక ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ విడుదలపై కూడా భారీ చర్చ నడుస్తోంది. మొదటి భాగం నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలై రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. దీంతో రెండో భాగానికి కూడా అదే సంస్థ భారీగా రూ. 250 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. అయితే, మేకర్స్ ఆ ఆఫర్‌ను తిరస్కరించి, తమ సొంత ఓటీటీ ప్లాట్‌ఫామ్ అయిన జియో హాట్ స్టార్‌లోనే ఈ చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకోవడం విశేషంగా మారింది. ముందుగా ఈ చిత్రాన్ని సెప్టెంబర్ నెలలో డిజిటల్ స్ట్రీమింగ్‌కు తీసుకురావాలని భావించినప్పటికీ, థియేట్రికల్ రన్ క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో ప్లాన్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. తాజా సమాచారం ప్రకారం, మే నెలాఖరు లేదా జూన్ మొదటి వారంలోనే 'ధురంధర్ 2' ఓటీటీ ప్రీమియర్ జరగవచ్చని టాక్ వినిపిస్తోంది. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ప్రేక్షకులకు, లేదా మళ్లీ చూడాలని ఆశించే అభిమానులకు ఈ ఓటీటీ విడుదల శుభవార్తగా మారనుంది. ఇక ఈ విషయంపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొత్తానికి, బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తున్న 'ధురంధర్ 2' సినిమా, త్వరలోనే ఓటీటీ వేదికగా కూడా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది.

# నిర్మాతగా మారనున్న అజిత్ కుమార్?



స్టార్ హీరో అజిత్ కుమార్ నిర్మాతగా మారనున్నారంటూ కోలీవుడ్‌లో విస్తృతంగా ప్రచారం సాగుతోంది. ఆయన హీరోగా నటించే 64వ చిత్రాన్ని సొంతంగా నిర్మించాలని భావిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఇంటర్నేషనల్ కార్ రేసింగ్ పోటీలపై ఆయన దృష్టి సారించారు. అలాగే గుడ్ బ్యాడ్ అగ్లీ మూవీ తర్వాత ఈ చిత్ర దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలోనే నటించేందుకు అంగీకరించినట్టు వార్తలు వస్తున్నాయి. అయితే, ఈ ప్రాజెక్టు కోసం ఆయన నిర్మాతగా మారాలని భావిస్తున్నారు. అజిత్ కుమార్ స్పోర్ట్స్ సర్వీస్ ఎల్‌ఎల్పీ అనే పేరుతో నిర్మాణ సంస్థ పేరును దక్షిణ భారత చలనచిత్ర వాణిజ్య మండలి (సౌత్ ఇండియన్ ఫిల్మ్ చాంబ ర్)లో రిజిస్టర్ చేయించారు. రూ. 2.56 లక్షలు చెల్లించి లైఫ్‌టైమ్ మెంబర్‌షిప్ కూడా తీసుకు న్నారు. నిర్మాతగా మారేందుకు ఫిల్మ్ చాంబర్‌లో అజిత్ సభ్యత్వం తీసుకున్నారని కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, నిర్మాతగా మారితే ఆయన హీరోగా నటిస్తారా లేదా అన్నది ఇపుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. తన సొంత నిర్మాణ సంస్థపై ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించే చిత్రాన్ని నిర్మించేలా చర్యలు తీసుకున్నట్టు సమాచారం. దీనిపై మరో 15 రోజుల్లో స్పష్టమైన క్లారిటీ రావొచ్చని ఫిల్మ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# 'స్వయంభు' కూడా ఇప్పట్లో వచ్చేలా లేదుగా..




యువ హీరో నిఖిల్ సిద్ధార్థ కెరీర్‌లోనే అత్యంత భారీ వ్యయంతో రూపొందుతున్న పీరియడ్ నేపథ్య చిత్రం 'స్వయంభు.' ఈ మూవీ రిలీజ్ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ మూవీ మరోసారి వాయిదా పడనుందని తెలుస్తుంది. ప్రారంభంలో ఈ చిత్రాన్ని ఫిబ్రవరిలో విడుదల చేయాలని భావించినప్పటికీ, తరువాత వేసవి కాలానికి మార్చారు. ఇప్పుడు మరోసారి విడుదల తేదీ మారే పరిస్థితి ఏర్పడింది. చిత్ర బృందం ఏప్రిల్ 30న రిలీజ్ చేయాలని పరిశీలించినప్పటికీ, సాంకేతిక పనులు ఇంకా పూర్తికాకపోవడంతో ఆ తేదీ సాధ్యం కాలేదని సమాచారం. ముఖ్యంగా చిత్రంకి సంబంధించిన భారీ వీఎఫ్ఎక్స్ పనులకి మరింత సమయం పడుతుందని తెలుస్తుంది. పీరియాడిక్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రతిదృశ్యం అత్యున్నత స్థాయిలోఉండేలా చిత్ర బృందంశ్రద్ధ తీసుకుంటోంది. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా, ప్రేక్షకులకు అద్భుత అనుభూతిని అందించాలనే ఉద్దేశంతోనే విడుదలను వాయిదా వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన విజువల్స్ కథలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అందుకే అవి పూర్తి స్థాయిలో మెరుగ్గా రావాలని హీరో నిఖిల్ సిద్ధార్థతో పాటు చిత్ర యూనిట్ పట్టుదలగా ఉంది. తొందరపడి విడుదల చేయడం కంటే, పూర్తి స్థాయి పనులు ముగిసిన తర్వాతే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని మే నెల చివరి వారంలో విడుదల చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. విడుదల తేదీ ఖరారైన వెంటనే ప్రచార కార్యక్రమాలు కూడా భారీ స్థాయిలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

# కొరియన్ కనకరాజు నుంచి కమ్సాహంనిదా' పాట ప్రోమో




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'కొరియన్ కనకరాజు' . ఇండో-కొరియన్ నేపథ్యంలో హారర్-కామెడీ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను చిత్ర బృందం ఘనంగా ప్రారంభించింది. ఈ చిత్రంలోని మొదటి పాట 'కమ్సాహంనిదా' ప్రోమోను తాజాగా విడుదల చేయగా, దీనికి విశేష స్పందన లభిస్తోంది. సంగీత దర్శకుడు ఎస్. థమన్, వరుణ్ తేజ్ మరియు దర్శకుడు మేర్లపాక గాంధీ మధ్య సాగే ఫన్నీ సంభాషణలతో కూడిన ఈ ప్రోమో యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచింది. మెలోడీ కింగ్ సిద్ శ్రీరామ్ ఆలపించిన ఈ పూర్తి పాటను ఏప్రిల్ 11న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, స్టార్ కమెడియన్ సత్య కీలకమైన వినోదాత్మక పాత్రలో అలరించనున్నారు. కొరియా సంస్కృతికి మరియు లోకల్ క్యారెక్టర్ అయిన కనకరాజుకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధాన్ని దర్శకుడు మేర్లపాక గాంధీ తన మార్కు వినోదంతో వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడు.

ఇప్పటికే మేజర్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఆఖరి షెడ్యూల్‌ను దక్షిణ కొరియాలోని అందమైన లొకేషన్లలో పూర్తి చేసుకోబోతుంది. యూవీ క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ, ప్రమోద్ మరియు విక్రమ్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ ఈ డిఫరెంట్ కథాంశంతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. మనోజ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాను 2026 వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# మైఖేల్ జాక్సన్ బయోపిక్ ట్రైలర్ విడుదల విడుదల

ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న పాప్ రారాజు మైఖేల్ జాక్సన్ బయోపిక్ 'మైఖేల్' ఫైనల్ ట్రైలర్‌ను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది . ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్ పోషిస్తుండగా, ట్రైలర్‌లో ఆయన బాడీ లాంగ్వేజ్, డ్యాన్స్ మూమెంట్స్ మరియు లుక్ అచ్చం మైఖేల్ జాక్సన్‌ను తలపిస్తుండటం విశేషం. దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా తెరకెక్కించిన ఈ ట్రైలర్‌లో 'బీట్ ఇట్', 'థ్రిల్లర్', 'బిల్లీ జీన్' వంటి ఐకానిక్ సాంగ్స్ ప్రదర్శనలతో పాటు, మైఖేల్ వ్యక్తిగత జీవితంలోని భావోద్వేగ అంశాలను, బాల్యంలో ఆయన ఎదుర్కొన్న సంఘర్షణలను మరియు వివాదాలను ఎంతో ఆకట్టుకునేలా చూపించారు. ఆస్కార్ విజేత గ్రాహమ్ కింగ్ నిర్మించిన ఈ చిత్రంలో కోల్‌మన్ డొమింగో, నియా లాంగ్, మైల్స్ టెల్లర్ వంటి హాలీవుడ్ ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించారు. కేవలం ఒక సంగీత ప్రయాణంలా కాకుండా, ఒక లెజెండరీ స్టార్ జీవితంలోని ఎత్తుపల్లాలను ఆవిష్కరించే ఈ చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అన్ని హంగులతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

# కారులో జీవన్ లొల్లి..!



కరీంనగర్, ఏప్రిల్ 10, : దశాబ్దాల కాలం పాటు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి, ఆ పార్టీ సిద్ధాంతాలను నరనరాల్లో జీర్ణించుకున్న సీనియర్ నేత జీవన్ రెడ్డి రాజకీయ ప్రస్థానం ఇప్పుడు కొత్త మలుపు తిరిగింది. జగిత్యాల కోటలో కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించిన ఈ దిగ్గజ నేత, ఇప్పుడు 'హస్తం' వదిలి 'కారు' ఎక్కేందుకు సిద్ధమయ్యారు. ఏప్రిల్ 27న బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన అధికారికంగా గులాబీ తీర్థం పుచ్చుకోనుండటం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. జగిత్యాలలో తన రాజకీయ ప్రత్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్‌లోకి చేర్చుకోవడం జీవన్ రెడ్డికి ఏమాత్రం మింగుడుపడలేదు. కష్టకాలంలో పార్టీని నమ్ముకున్న వారిని కాదని, గెలిచిన నేతలను చేర్చుకుంటూ ఓడిన మమ్మల్ని అవమానిస్తారా? అన్న ఆయన ఆవేదన పార్టీలోని పాత కాపుల పరిస్థితికి అద్దం పడుతోంది. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికల తరుణంలో సంజయ్ కుమార్‌కు పార్టీలో అధిక ప్రాధాన్యత ఇవ్వడం జీవన్ రెడ్డిని తీవ్ర అసహనానికి గురిచేసింది. ఆత్మగౌరవం దెబ్బతిన్న చోట ఉండలేక, తన రాజకీయ భవిష్యత్తు కోసం ఆయన బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపారు. బీఆర్ఎస్ అధిష్టానం జీవన్ రెడ్డికి అత్యున్నత స్థాయి గౌరవాన్ని ఇచ్చేందుకు సిద్ధమైంది. గతంలో కె.కేశవరావు నిర్వహించిన సెక్రటరీ జనరల్ పదవిని జీవన్ రెడ్డికి ఆఫర్ చేసినట్లు సమాచారం. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఆయనకు సంకేతాలిచ్చినట్లు తెలుస్తోంది. పార్టీలో కేసీఆర్, కేటీఆర్ తర్వాత అంతటి ప్రాధాన్యత ఉన్న ఈ పదవి ఇదే.! అయితే కొత్తగా వచ్చిన నేతకు ఇంతటి అత్యున్నత పదవి ఇవ్వడంపై బీఆర్ఎస్ లోని కొందరు సీనియర్లు పెదవి విరుస్తున్నట్టు తెలుస్తోంది. ఎంతో కాలంగా పార్టీని అంటిపెట్టుకుని ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేతలను కాదని, నిన్నటిదాకా తమను తీవ్రంగా విమర్శించిన నేతకు రెడ్ కార్పెట్ వేయడం ఏమిటనేది వాళ్ల ఆవేదన. జీవన్ రెడ్డి రాకతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆధిపత్య పోరు మొదలయ్యే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో గంగుల కమలాకర్ వంటి బలమైన నేతలు ఉండగా, ఇప్పుడు జీవన్ రెడ్డి చేరికతో నాయకత్వ సమీకరణాలు మారిపోనున్నాయి. జగిత్యాలలో నిన్నటి వరకు జీవన్ రెడ్డి, సంజయ్ కుమార్ వర్గాలు వీధి పోరాటాలు చేసుకున్నాయి. ఇప్పుడు అకస్మాత్తుగా నాయకుడు మారడంతో ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ఎవరి కింద పనిచేయాలో తెలియక గందరగోళంలో ఉన్నారు. సంజయ్ కుమార్ వైఖరికి వ్యతిరేకంగా జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లోకి వెళ్తుండటంతో, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు రెండు గ్రూపులుగా విడిపోయే ప్రమాదం ఉంది. ఇటీవలి ఎన్నికల్లో వరుసగా ఓటమి పాలవుతున్న జీవన్ రెడ్డిని చేర్చుకోవడం వల్ల పార్టీకి వచ్చే మైలేజీ ఎంత అనే చర్చ కూడా సాగుతోంది. జీవన్ రెడ్డికి గతంలో ఉన్నంత ప్రజాబలం లేదని, ఆయన కంటే యువనేతలను ప్రోత్సహించడం మేలని క్షేత్రస్థాయి క్యాడర్ అభిప్రాయపడుతోంది. గతంలో కేకే విషయంలో జరిగిన పరిణామాలను గుర్తు చేస్తూ కొందరు నేతలు అధిష్టానాన్ని హెచ్చరిస్తున్నారు. జీవన్ రెడ్డికి ఉన్న అపారమైన రాజకీయ అనుభవం, సభలో ఆయన వాగ్ధాటి పార్టీకి బలంగా మారుతుందని కేసీఆర్ భావిస్తున్నారు. ఏది ఏమైనా, జీవన్ రెడ్డి నిర్ణయం కరీంనగర్ జిల్లా గులాబీ తోటలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందో లేక వర్గ పోరు అనే ముళ్లను జల్లుతుందో వేచి చూడాలి.

## అంగన్వాడి కేంద్రంలో శిశుపోషణ పక్వాడ కార్యక్రమం



జగిత్యాల/ బుగ్గారం: 10 ఏప్రిల్ (తెలంగాణ వాణి విలేకరి): జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం వెలుగొండ గ్రామంలో శిశు పోషణ పక్వాడ ప్రోగ్రాంలో భాగంగా ఈరోజు వెలుగొండ గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో శిశు సమగ్ర అభివృద్ధి సూపర్వైజర్ నీలిమ ఆధ్వర్యంలో శిశు పోషణ పక్వాడకార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలోశిశుపోషణపై పిల్లలకు గర్భిణీ తల్లులకు బాలింతలకు పాలు గుడ్లు పోషకమైన పదార్థాలు అవగాహన మరియు స్థానికంగా దొరికే కూరగాయలు ఆకుకూరలు పండ్లు సాంప్రదాయ ఆహార పద్ధతులను గూర్చి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ నీలం నందిని వార్డు సభ్యులు సెక్రెటరీ శైలజ అంగన్వాడీ టీచర్స్ పద్మ రజిత రమాదేవి ఎం (ఎల్ హెచ్ పి) సౌమ్య,ఏఎన్ ఎం జయసుధ, ఆశా కార్యకర్తలు శారద, నాగమణి పిల్లల తల్లులు గ్రామంలోని ప్రజలు, ఇతర సభ్యులు తదితరులు హాజరైనారు.

# భారతీయ వైద్య విధానం ప్రపంచానికి ఆదర్శం

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల (తెలంగాణ వాణి): భారతీయ వైద్య విధానం ప్రపంచానికి ఆదర్శమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రపంచ హోమియోపతి దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా ఆయుష్ వైద్య శిబిరానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత ప్రోగ్రాం అధికారులతో హాజరయ్యారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచానికి భారతీయ వైద్య విధానం ఆదర్శంగా నిలిచిందని ఎన్నో రకాల వైద్య పద్ధతుల ద్వారా వ్యాధులను నయం చేసే విధానాలను అవలంబించడం జరుగుతుందని తెలిపారు. భారతీయ వైద్య వ్యవస్థలో హోమియో ఆయుర్వేదం యునాని యోగ వంటి అనేక పద్ధతులలో వ్యాధులను నయం చేసేందుకు అవకాశం ఉందని కీళ్ల నొప్పులు మధుమేహం రక్త పటు వంటి దీర్ఘకాలిక వ్యాధులను హోమియోపతి న్యాచురోపతి యోగ వంటి విధానాల ద్వారా నియంత్రించవచ్చని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆయుష్ వైద్యులు అందుబాటులో ఉన్నారని ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అతి సాధారణ ఖర్చులతో ప్రకృతికి దగ్గరగా యోగ ఫిజియోథెరపీ ద్వారా అందించే చికిత్సకు మంచి ఫలితాలు లభిస్తున్నాయని ప్రభుత్వం చేపట్టిన ప్రజా పలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని గ్రామీణ స్థాయి నుండి పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమంలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని మన జిల్లాను పరిశుభ్రంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వైద్యులు జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సేవల నిలయం జిల్లా ప్రధాన ఆసుపత్రి



## ఆయుర్వేద, యునాని, హోమియోపతి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి (తెలంగాణ వాణి) జిల్లా ప్రధాన ఆసుపత్రి వైద్య సేవలకు నిలయంగా మారిందని, ఇక్కడ అన్ని రకాల సేవలు ఉచితంగా లభిస్తున్నాయని, దీనిని అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శు క్రవారం పెద్దపల్లి జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రి ఆవరణలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఉచిత ఆయుష్ వైద్య శిబిరాన్ని ప్రజ్వలన చేసి కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆయుర్వేద, హోమియో, యునాని మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, జిల్లా ఆయుష్ ఆస్పత్రిలో రోజు 100నుండి 120 మంది బయటి రోగులు వైద్య సేవలు వినియోగించుకుంటున్నారని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన మందులు , వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నార ని జిల్లా ప్రజలు వైద్య సేవలను వినియోగించు కోవాలని కలెక్టర్ అన్నారు. అంతకంటే ముందు వైద్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రకరకాల యునాని, ఆయుర్వే దిక్, హోమియోపతి మెగా వైద్య శిబిర మందుల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఆరోగ్య వైద్యశాఖ అధికారి డాక్టర్. ప్రమోద్ కుమార్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఆయుష్ వైద్యులు , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమతౌల్య ఆరోగ్యానికి హోమియోపతి ఉత్తమమైన మార్గం



## జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల: ఏప్రిల్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి): సమతౌల్య ఆరోగ్యానికి హోమియోపతి ఉత్తమమైన మార్గంఅని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం జగిత్యాల మాతా శిశు ఆసుపత్రిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ హోమియోపతి దినోత్సవం ఆయుష్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవుని జీవన విధానంలో యోగ భాగం కావాలన్నారు. భారతదేశ సనాతన వైద్యం హోమియోపతి అని, ప్రపంచంలో మొదటి కటరాక్ట్ చికిత్స చేసింది సుశ్రుతుడని, రోగం వచ్చాక చికిత్స కన్నా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేమన్నారు. అంతకుముందు హోమియోపతి వైద్య సృష్టి కర్త డాక్టర్ సి.ఎఫ్.ఎస్. హెన్మాన్ జయంతి ని పురస్కరించుకుని వారి చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, డియం హెచ్ఓ సుజాత, డిప్యూటీ డియం హెచ్ఓ శ్రీనివాస్, సూపరిండెంట్ డాక్టర్. కృష్ణ మూర్తి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీల్, డాక్టర్ నరేశ్, కౌన్సిలర్లు ప్రశాంత్ రావు, దుమాల రాజ్ కుమార్, సర్పంచ్ మోహన్ రెడ్డి, ఏవో మెప్మ శ్రీనివాస్, నాయకులు కోటేశ్వర రావు, ప్రవీణ్ రావు,నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్ పర్యావరణ హితం

## ఉమ్మడి జిల్లా రెడ్కో మేనేజర్ దురిశెట్టి మనోహర్



మెట్ పల్లి:ఏప్రిల్ 10 (తెలంగాణ వాణి)ప్రతీ విద్యు త్ వినియోగదారుడు ఇంటి పైకప్పు మీద సోలార్ ఫలకలు బిగించుకొని పర్యావరణానికి అనుకూలమైన హరిత ఇంధ న ఉత్పత్తి చేయాలని కరీంనగర్ ఉమ్మడి జిల్లా రెడ్కో మేనేజర్ దురిశెట్టి మనోహర్ తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇందుకు ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకాన్ని వినియోగించు కోవాలని సూచించారు. తద్వారా 1కిలో వాట్ కు 30 వేలు,2కిలో వాట్లకు 60వేలు, 3కిలో వాట్లు అంతకు పైన 78వేల సబ్సిడీ పొందవచ్చని ఉమ్మడి జిల్లా రెడ్కోమేనేజర్ దురిశెట్టి మనోహర్ వెల్లడిం చారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వా లు ఈ పథకాన్ని శరవేగంతో ముందుకు తీసుకొని వెళ్త న్నాయన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరి వరకు ఒక కోటి ఇండ్లపై సోలార్ ఫలకల బిగింపు పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించారన్నారు. పీఎం సూర్యఘర్ ప్రచార రథం ద్వారా మెట్ పల్లి లో విద్యుత్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది,వినియోగదారులకు సోలార్ ఎనర్జీ పై విస్తృత అవగాహన కల్పించా రు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 2554 మంది లబ్ధిదా రులు 8896 కిలోవాట్ల సోలార్ ఫలకలు బిగించు కున్నందుకు గానూ రూ. 17.43కోట్ల సబ్సిడీ వారి ఖాతాల్లో జమచేయడం జరిగిందని ఆయన చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమంలో మెటుపల్లి ఏడీఈ రవి, ఏఈలు అజయ్,స్రవంతి,లైన్ ఇన్స్పెక్టర్లు సురేష్,హరి ప్రసాద్,రవీందర్,సిబ్బంది, వినియోగదారులు పాల్గొ న్నారు.

# క్యాంటీన్‌లో మిల్లెట్స్ వంటకాలు అందుబాటులోకి తేవాలి



## జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి బ్యూరో (తెలంగాణ వాణి): ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో అందుబాటులో ఉన్న ఆహార పదార్థాలను స్వయంగా పరిశీలించారు. క్యాంటీన్ ద్వారా తయారవుతున్న ఆహార పదార్థాల వివరాలను నిర్వహణ సిబ్బందిని అడిగి తెలుసుకున్న కలెక్టర్, కార్యాలయాలకు విచ్చేసే ఉద్యోగులు, ప్రజలకు నాణ్యమైన, శుభ్రమైన ఆహారం అందించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా సిరిధాన్యాలు (మిల్లెట్స్)తో తయారుచేసిన ఇడ్లీ, దోశ వంటి ఆరోగ్యకరమైన వంటకాలను క్యాంటీన్‌లో అందుబాటులోకి తేవాలని సూచించారు. క్యాంటీన్ నిర్వహణ విధానంపై వివరాలు సేకరించి, ఎన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారో తెలుసుకున్నారు. క్యాంటీన్‌లో నాణ్యమైన, తాజా ఆహార పదార్థాలనే విక్రయించాలని, శుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ పర్యటన సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ సందర్శించారు. మహిళా సంఘాల ద్వారా తయారుచేసిన వివిధ ఆహార పదార్థాలను రుచి చూసి, మహిళల స్వయం ఉపాధి అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లెనినా సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మరోమారు షాకిచ్చిన పసిడి ధర

### ఏకంగా రూ.1,520 పెరుగుదల

న్యూఢిల్లీ,ఏప్రిల్10 : పసిడి ప్రియులకు మరోసారి షాకిస్తూ బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో పసిడి పరుగు కొనసాగుతోంది. తాజాగా 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధరపై ఏకంగా రూ. 1,520 పెరగడంతో, ప్రస్తుతం రూ. 1,53,000 మార్కుకు చేరుకుంది. 22 క్యారెట్ల పసిడి ధర కూడా రూ. 1,400 మేర ఎగబాకి, 10 గ్రాముల ధర రూ. 1,40,250 వద్ద కొనసాగుతోంది. పసిడితో పాటే వెండి కూడా అదే స్థాయిలో దూసుకుపోతోంది. కిలో వెండి ధరపై ఏకంగా రూ. 5,000 పెరగడంతో ప్రస్తుత ధర రూ. 2,65,000కి చేరింది. వరుసగా పెరుగుతున్న ఈ ధరలతో సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యం

## జీవన శైలిలో యోగ ఒక భాగంగా అలవార్చుకోవాలి

## ఆరోగ్య సంరక్షణకు యోగ ఎంతో అవసరం



జగిత్యాల: ఏప్రిల్ 10 (తెలంగాణ వాణి ప్రతినిధి): ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ హోమియోపతి దినోత్సవం, ఆయుష్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రం లోని ఉదయం యోగా భవన్‌లో యోగా ప్రదర్శన జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం మెగా ఆయుష్ వైద్య శిబిరాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్, జిల్లా వైద్యాధికారి సుజాత తో కలిసి ప్రారంభించారు. ఈ శిబిరంలో హోమియోపతి, ఆయుర్వేదం, ఇతర ఆయుష్ వైద్య విధానాల ద్వారా ప్రజలకు ఉచిత వైద్య సేవలు,ఔషధాలు అందించడం జరుగుతుంది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం యోగ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, రోజువారి జీవనశైలిలో యోగ ప్రక్రియను ఒక భాగంగా అలవార్చుకోవాలని అన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఆయుష్ వైద్య విధానాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. యోగా, ఆయుర్వేదం, హోమియోపతి వంటి సంప్రదాయ వైద్య పద్ధతులు ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు జీవనశైలిని మెరుగుపరుస్తాయని,ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ మెగా ఆయుష్ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సులభంగా వైద్య సేవలు అందించడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు. ప్రజలందరూ యోగా వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సుజాత, వివిధ జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com